


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 302, పేజీలు - 08
సోమవారం, ఏప్రిల్ 20, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ

## - గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

- విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రధాన చర్చ
- డ్రగ్స్ కట్టడికి పలు సూచనలు చేసిన గవర్నర్
- గవర్నర్ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్న సీఎం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పెండింగ్‌లో ఉన్న ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రొఫెసర్.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా అజారుద్దీన్ కొనసాగుతున్నారు. ఆయన మంత్రి పదవి చేపట్టి ఈ నెలాఖరుకు ఆరు నెలలు పూర్తి కానుంది. 6 మాసాల్లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఉండాల్సిన అవసరం ఉంది. గవర్నర్ ఆమోదించకపోతే ఈ నెల 30 తర్వాత అజారుద్దీన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే గవర్నర్‌ను సీఎం కలిసినట్లుగా తెలిసింది. దీంతో పాటు విద్యారంగానికి సంబంధించి పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది.

**- విద్యారంగానికి సంబంధించిన అంశాలపై చర్చ**

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును పట్టి పిడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా లోక్భవన్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ యువతను,విద్యా వ్యవస్థను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం, లోక్ భవన్ కలిసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో గవర్నర్ పలు నిర్మాణాత్మక సూచనలు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు విద్యాసంస్థల్లో



అడుగుపెట్టే తొలి రోజే డ్రగ్స్కు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఉండాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ పొందే సమయంలోనే 'మేము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం వాటిని ప్రోత్సహించం' అని విద్యార్థుల నుంచి అధికారికంగా ప్రమాణ పత్రం తీసుకోవాలని సూచించారు.

2లో..

### మహిళలను అడ్డుపెట్టుకొని

# రాజకీయ కుట్ర

## - మోదీకి దీదీ కౌంటర్



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంటోంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో శనివారం రాత్రి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకేలను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేసిన ప్రధాని మోదీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించకుండా ఈ పార్టీలు అడ్డుపడ్డాయని మండిపడ్డారు. అయితే ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై తాజాగా ఎక్స్ వేదికగా స్పందించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణముల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
ప్రధాని మోదీ సమస్యను నిజాయితీగా పరిష్కరించడానికి బదులుగా దేశాన్ని తప్పుదోవ పట్టించాలని చూడటం చాలా దురదృష్టకరమని దీదీ పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళలకు అధిక రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఇచ్చిందని స్పష్టం చేశారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ రెండింటిలోనూ టీఎంసీకి అత్యధిక మంది మహిళా ప్రతినిధులు ఉన్నారని గుర్తు చేశారు. టీఎంసీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో 37.9 శాతం మంది మహిళలు ఉన్నారని

2లో..

# మార్పు మంచికే

## - పార్టీ పై నిర్ణయం వెలువరించే ఛాన్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్ర సమితి కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితిని తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మార్చడంతోనే ఆ పార్టీ వైఫల్యాల బాట పట్టిందని నమ్ముతున్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కోల్పోయేవిధంగా బీఆర్ఎస్ పేరు పెట్టడంతోనే గత ఎన్నికల్లో దారుణంగా దెబ్బతిన్నామని టాప్ లీడర్ల నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ అంటే తమకు సంబంధం లేని పార్టీగా జనం చూస్తున్నారని అందుకే మళ్లీ టీఆర్ఎస్ గా మార్చాలంటూ కొందరు నేతలు బహిరంగంగానే చెబుతున్నారు.


**-ఇటీవల ఒక సమావేశంలోనూ..**

2లో..

### అమెరికాతో ఒప్పందం చేసుకోకపోతే సర్వనాశనం చేస్తాం

**- ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక**

2లో..



### పారదర్శకంగా ఉన్నాం..

# ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

- పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడటం లేదు
- శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య భావోద్వేగ బంధం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందని, ఈ వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ సేవల విషయంలో తాము అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు. రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు. ఈ కష్టాన్ని, ప్రభుత్వం పడుతున్న శ్రమను ప్రజలకు

2లో..

# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'

## - దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
- 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు
- మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో సైబర్ నేరాలను అరికట్టడంలో హైదరాబాద్ సైబర్ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటివరకు దేశ, విదేశాలకు చెందిన సైబర్ నేరగాళ్ల ముఠాను మట్టికరిపించిన పోలీసులు తాజాగా మరో కీలక ఆపరేషన్ చేపట్టారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఆపరేషన్ ఆక్టోపస్-2.0 పేరుతో రంగంలోకి

2లో..



# చిన్నారి పునర్విక స్ఫూర్తితో 'ప్రాజెక్ట్ పునర్విక'

## - మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఒక మానవీయ కోణంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. అరుదైన జన్యు వ్యాధితో పోరాడిన చిన్నారి పునర్విక ఘటన మంత్రిని తీవ్రంగా ఆలోచింపజేసింది. ఈ క్రమంలో అరుదైన జన్యు వ్యాధులతో బాధపడే పిల్లలందరికీ అండగా నిలిచేందుకు ఆయన 'ప్రాజెక్ట్ పునర్విక'ను అధికారికంగా ప్రకటించారు. అత్యంత ఖరీదైన చికిత్సలు అందక ఏ చిన్నారి ప్రాణం పోకూడదనే ఉద్దేశంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ పునర్వికలో భాగంగా అరుదైన వ్యాధులకు అవసరమైన ఖరీదైన మందుల ధరలను తగ్గించేందుకు అంతర్జాతీయ ఔషధ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేష్ నిర్ణయించారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన విధానపరమైన మద్దతును పొందేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కేవలం చికిత్స అందించడమే కాకుండా, వైద్యులు, నిపుణులతో కలిసి

2లో..

### ఉచిత రైలు ప్రయాణంపై

# సర్కార్ క్లారిటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి హైదరాబాద్ నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని వార్తలు వెలువడ్డాయి. అయితే దీనిపై సోషల్ మీడియా, కొన్ని మీడియాలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పించే అంశంపై దక్షిణ మధ్య రైల్వేతో తెలంగాణ ప్రభుత్వం కీలక చర్చలు జరుగుతున్నాయని పేర్కొంది. వీటికి సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఏ), పట్టణాభివృద్ధి శాఖ సంయుక్తంగా దక్షిణ మధ్య రైల్వే కు ఒక ప్రతిపాదనను పంపించినట్లు తెలిపింది. రాష్ట్ర సర్కార్ ఈ అధికారిక

2లో..

# కవితకు కొత్త జోష్

- కవిత పార్టీలోకి నేతల వలసలు
- పార్టీ పెట్టకముందే క్యూ కడుతున్న నేతలు
- జాగృతిలోకి మాజీ ఎమ్మెల్యే



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసిన కవిత దానికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. ఇప్పటికే కాశీ, అయోధ్య పర్యటన పూర్తి చేసుకున్న కవిత కొత్త పార్టీ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే తాను పెట్టనున్న పార్టీలోకి రావాలని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులు, మాజీ మావోయిస్టులు, యువత, మేధావులకు ఇప్పటికే కవిత విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నేత రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరారు. ఆదివారం నాడు తన అనుచరులతో కలిసి

2లో..

### బీజేపీ ఎన్నికల ప్రచారంలో

# ఆసక్తికర పరిణామం

## - 'ఝుల్మురి' కొనుకొని తిన్న ప్రధాని మోడీ



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ బెంగాలీ సంప్రదాయ ఆహార రుచులను ఆస్వాదించారు. ప్రచారం ముగిసిన తరువాత ఆయన సెక్యూరిటీని వదిలి మరీ ఓ చిన్న షాపు వద్దకు వెళ్లి స్నాక్స్ కొనుగోలు చేసి తిన్నారు. దానికిగానూ అతడికి రూ.10 చెల్లించారు. దీనికి సంబంధించిన ఫోటోలను ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. బెంగాల్‌లో ఈసారి ఎలాగైనా జెండా పాతాలని బీజేపీ తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రధాని మోదీతో పాటు ఇతర అగ్రనేతలు బహిరంగ సభల్లో పాల్గొని కేంద్రం చేస్తున్న అభివృద్ధిని పేర్కొంటూనే మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

2లో..

ప్రజాప్రశ్న



# విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ

### - సీఎంకు పలు కీలక సూచనలు చేసిన గవర్నర్

విద్యాసంస్థల్లో కేవలం చదువు మాత్రమే కాకుండా, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని, విద్యార్థులతో సామూహిక ప్రమాణాలు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్ సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ లేని సమాజం ప్రాముఖ్యతను వివరించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలపై రేవంత్ రెడ్డితో గవర్నర్ చర్చించారు.

కేవలం డ్రగ్స్ అంశమే కాకుండా, రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతులు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న విద్యావేత్తల పోస్టులు, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలపై భేటీలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యా సంస్థల పనితీరు ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ చేసిన ప్రతిపాదనల పట్ల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఆయన సూచించిన విధంగా అడ్మిషన్ల సమయంలో అఫిడవిట్లు తీసుకోవడం, విద్యార్థులతో ప్రమాణం చేయించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 12న జరగబోయే కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### - ఎమ్మెల్సీల నియమాకం విషయంలో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి నెలకొన్న ఉత్కంఠను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. రాజ్యాంగం ప్రకారం, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణం చేసిన వ్యక్తి, ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రి పదవి చేపట్టి ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నాయి. ఒకవేళ ఈలోగా గవర్నర్ ఆయన ఎమ్మెల్సీ నియామక ఫైల్‌పై సంతకం చేయకుంటే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా వివరణ ఇచ్చారు. గతంలో కోర్టులో ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగిపోయినందున, తక్షణమే ఆమోద ముద్ర వేయాలని గవర్నర్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# మహిళలను అడ్డుపెట్టుకొని రాజకీయ కుట్ర

అదే సమయంలో రాజ్యసభకు 46 శాతం మహిళా సభ్యులను నామినేట్ చేసినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్లను టీఎంసీ వ్యతిరేకించలేదని అలాంటి ప్రశ్న ఎన్నడూ తలెత్తలేదని దీదీ తేల్చి చెప్పారు. తన స్వార్థ రాజకీయ అజెండా కోసం మోదీ సర్కార్ మహిళలను ఒక రక్షణ కవచంగా వాడుకుంటూ డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చడాన్ని ఈ దేశాన్ని విభజించడాన్ని ఇతర రాష్ట్రాల ఖర్చుతో బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం కల్పించేలా రాజకీయ సరిహద్దులను తిరిగి గీస్తూ, అధికారాన్ని హస్తగతం చేసుకోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తేల్చి చెప్పారు. ఇది సమాఖ్య వ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై దాడిగా ఆమె అభివర్ణించారు. మోదీ సర్కార్ ఇలా చేస్తుంటే తాము మౌనంగా చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లపై మోదీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే 2023 సెప్టెంబర్ 28వ తేదీన మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన తర్వాత దాదాపు 3 ఏళ్లపాటు ఎందుకు వేచి చూసిందని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఎందుకు హడావుడిగా తీసుకువచ్చారని నిలదీశారు. అంతేకాకుండా మహిళా రిజర్వేషన్ల బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు జత చేశారని అడిగారు. దశాబ్దాలుగా మహిళల పక్షాన నిలబడిన పార్టీ తృణమూల్ కాంగ్రెస్ అని తేల్చి చెప్పారు. ఇక ముందు కూడా మహిళల వైపే నిలబడుతుందని స్పష్టం చేశారు. అదే సమయంలో శనివారం రాత్రి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపైనా మమతా బెనర్జీ మండిపడ్డారు. ఇంకోసారి జాతిని ఉద్దేశించి ప్రసంగించినప్పుడు పార్లమెంట్ నుంచి మాట్లాడే ధైర్యం చేయాలని ప్రధాని మోదీకి హితవు పలికారు. పార్లమెంటులో అయితే నిశిత పరిశీలనకు, సవాలుకు, జవాబుదారీతనానికి లోబడి ఉంటారని పేర్కొన్నారు. ఇలా కెమెరా ముందు మాట్లాడటం అంటే అది పిరికితనం, కపటత్వం, రెండు నాలుకల ధోరణి అని మండిపడ్డారు. అధికారం చేతుల నుంచి జారిపోతుందని మోదీ గుర్తించారని అందుకే దాన్ని కాపాడుకునేందుకు వారు ఎంతకైనా తెగించడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు.

# మార్పు మంచికే

ఇటీవల ఒక సమావేశంలోనూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ పేరు మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చడంపై కేసీఆర్ చేతుల్లో ఉందని అన్నారు. పార్టీ పేరు బీఆర్ఎస్ గా మారిన తర్వాత రాజకీయంగా చాలా నష్టపోయాం అని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అందుకే తిరిగి పార్టీ పేరును బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్ గా మార్చాలని నిర్ణయించామని, కేసీఆర్ దీనిపై త్వరలోనే ప్రకటన చేస్తారని చెప్పారు. దీంతో ఈ ఆవిర్భావ దినోత్సవం రోజునే కేసీఆర్ ప్రకటిస్తారని అంటున్నారు. అయితే అందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ను కూడా ఆశ్రయించాలని, తిరిగి టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించే ప్రక్రియకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు.

### - ప్రతినిధుల సభలోనే ప్రకటన..

అందుకే ఈసారి ఆవిర్భావ సభను కేవలం ప్రతినిధుల సభగానే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నెల 20వ తేదీన జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుండటంతో ఈ నెల 25వతేదీన తిరిగి బహిరంగ సభ అనవసరమని, అందులోనూ పార్టీ పేరు మార్పు ప్రకటన ఉంటుంది కాబట్టి ప్రతినిధుల సభగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ప్రతినిధుల సభకు కేవలం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గంతో పాటు ప్రభుత్వ మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లను మాత్రమే ఆహ్వానించాలని, ఈ సమావేశంలోనే బీఆర్ఎస్ ను కేసీఆర్ అధికారికంగా టీఆర్ఎస్ గా ప్రకటిస్తారని తెలిసింది.

# పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రభుత్వంపైనా, కూటమి పార్టీలపైనా కొందరు పనిగట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వివిధ మార్గాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. "ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వారే విశ్లేషించుకుంటారు. పరిపాలనలో ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని వారికి వివరిస్తే, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారు" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, ప్రజలు వాస్తవాలను గ్రహించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే మన ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు. పార్టీలో నేతలకు, కార్యకర్తలకు మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, 'కాఫీ కబుర్లు' వంటి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం 'ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' అనే వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఈ నెల 29వ తేదీన పార్టీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించనుందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని నేతలు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే, త్వరలో జరగనున్న మహానాడు నిర్వహణ కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.

# అమెరికాతో ఒప్పందం చేసుకోకపోతే సర్వనాశనం చేస్తాం

వాషింగ్టన్ (ప్రశ్న న్యూస్) ఇరాన్‌ను పూర్తిగా అంతం చేస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం హెచ్చరించారు. ఇరాన్ పట్ల ఇకపై ఎలాంటి మెతకవైఖరి ప్రదర్శించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా వారు ఒప్పందానికి రాకపోతే, గత 47 ఏళ్లలో గత అమెరికా అధ్యక్షులు చేయాల్సిన పనిని నేను చేయడం గౌరవంగా ఉంటుందని అన్నారు. ఇరాన్ కిల్లింగ్ మెషీన్‌కు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

### - ట్రూత్ సోషల్‌లో డోనాల్డ్ ట్రంప్ పోస్ట్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ షేర్ చేస్తూ ఇరాన్‌కు భారీ హెచ్చరిక జారీ చేశారు. 'ఇరాన్ సీజ్‌ఫైర్ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఇరాన్ శనివారం (18 ఏప్రిల్) హర్మూజ్‌లో కాల్పులు జరిపింది. ఇది మా మధ్య జరిగిన సీజ్‌ఫైర్ ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుంది. చాలా బుల్లెట్లు ఒక ఫ్రెంచ్ నౌక, యూకే కి చెందిన ఒక గూడ్స్ రవాణా నౌక (ఫ్రైటర్) వైపు టార్గెట్ చేశారు. ఇది ఏమాత్రం ఒప్పుకోదగిన విషయం కాదని' అన్నారు. 'నా ప్రతినిధులు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు మరోసారి వెళ్తున్నారు. సోమవారం (20 ఏప్రిల్) సాయంత్రం నాటికి చర్చల కోసం అక్కడికి చేరుకుంటారు' అని ట్రంప్ తెలిపారు.

### - హర్మూజ్ దిగ్బంధనం వల్ల ఇరాన్‌కే నష్టం: ట్రంప్

హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని, అది చాలా విడ్డూరంగా ఉందని డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఎందుకంటే తమ ఆంక్షలతో అది ఇప్పటికే మూతపడిందని అన్నారు. ఏమీ తెలియకుండానే వారు మాకు సహాయం చేస్తున్నారు. ఈ దారి మూసివేయడంతో ఇరాన్‌కు ప్రతిరోజూ 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోంది. అమెరికాకు మాత్రం ఎలాంటి నష్టం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం పలు నౌకలు అమెరికాలోని టెక్సాస్, లూసియానా, అలస్కా వైపు వెళ్తున్నాయి. అక్కడ అవి ముడిచమురు లోడింగ్ చేసుకుంటాయి. ఇదంతా ఎప్పుడూ శక్తివంతంగా కనిపించడానికి ప్రయత్నించే ఐఆర్జీసీ వల్ల జరుగుతోందని ట్రంప్ అన్నారు.

### - ఓవైపు అణు కార్యక్రమం.. మరోవైపు అమెరికాతో చర్చలు

ఒకవైపు ఇరాన్ అధ్యక్షుడు పేజెష్కియాన్ అణు సామర్థ్యం కార్యక్రమాన్ని తమ హక్కు అని చెబుతుంటే, మరోవైపు అమెరికాతో రెండో దవ చర్చలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇరు దేశాల మధ్య తదుపరి చర్చలు ఇస్లామాబాద్‌లో జరిగే అవకాశం ఉంది. రెండవ రౌండ్ చర్చలు మళ్లీ ఇస్లామాబాద్ వేదికగానే జరుగుతాయి.

### - నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లో దిగిన అమెరికా విమానం

సీ–17 గ్లోబ్‌మాస్టర్ ××× వంటి భారీ అమెరికా సైనిక విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లో దిగాయని పాకిస్తాన్ వర్గాలు తెలిపాయి. ఈ ఎయిర్‌బేస్ ఇస్లామాబాద్‌కు చాలా దగ్గరగా ఉంది. దీంతో పాటు, విమానాశ్రయం నుండి ఇస్లామాబాద్ రెడ్ జోన్‌కు వెళ్లే మార్గాలను మూసివేశారు. అధికారులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. సెరెనా హోటల్, మారియట్ హోటల్‌ను ఖాళీ చేస్తున్నారు. ఇక్కడి సెరెనా హోటల్‌లో ఏప్రిల్ 11న మొదటి రౌండ్ చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ గడువు ఏప్రిల్ 21న ముగుస్తుంది. ప్రస్తుతం ఈ కాల్పుల విరమణను పొడిగించేందుకు ట్రంప్ సిద్ధంగా లేరు. కనుక సోమవారం రోజు, లేక మంగళవారం నాడు అమెరికా, ఇరాన్ దేశాల ప్రతినిధులు రెండో దశ చర్చలు జరపనున్నారు.

### - పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాలు ఒకే వేదికపైకి

ఇరాన్, అమెరికా చర్చల్లో పాకిస్తాన్ కీలక పాత్ర పోషించింది. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ఇటీవల ఇరాన్‌ను సందర్శించారు. శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కారం చూసుకోవాలని స్పష్టం చేశారు. డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చల గురించి సానుకూల సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో ఏదైనా ఒప్పందం కుదిరితే, తాను స్వయంగా వెళ్లి ఒప్పందంపై సంతకం చేస్తానని ట్రంప్ అన్నారు. గత 8 వారాలుగా ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. దీనివల్ల హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది.

# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'

దిగిన హైదరాబాద్ సైబర్ పోలీసులు దేశంలోని పలు రాష్ట్రాల్లో దాడులు చేసి నిందితులను పట్టుకున్నారు. అమాయకులను మోసం చేసి వారి అకౌంట్లను ఖాళీ చేస్తున్న సైబర్ ముఠా ఆటను కట్టించారు. తాజాగా 9 రాష్ట్రాల్లో హైదరాబాద్ సైబర్ పోలీసుల జరిపిన సోదాల్లో బ్యాంకు అధికారులు సహా మొత్తం 52 మంది సైబర్ నిందితులను అరెస్ట్ చేశారు. ట్రేడింగ్ మోసాలు, పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశంలోని చాలా మంది అమయ ప్రజలను బెదిరించి మోసం చేసిన సైబర్ నేరగాళ్లు వారి నుంచి భారీగా డబ్బులు దోచుకున్నట్లు గుర్తించారు. అయితే ఈ సైబర్ ముఠాకు బ్యాంకు అధికారులు అండగా నిలుస్తున్నారని గుర్తించిన పోలీసులు ఆ దిశగా పక్క ప్లాన్ ప్రకారం ఈ ఆపరేషన్ నిర్వహించి ఇద్దర్నీ పట్టుకున్నట్లు వెల్లడించారు. ఇక మొత్తం 52 మంది నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు ఉండటం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. డబ్బులకు కక్కుర్తి పడి బ్యాంక్ ఉద్యోగులే సైబర్ నేరగాళ్లకు సహాయం చేస్తున్నారని గుర్తించారు. వీరితోపాటు 15 మంది మ్యూల్ అకౌంట్లు ఉన్నవారు ఐదుగురు మధ్యవర్తులను కూడా అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సైబర్ పోలీసులు తెలిపారు. సైబర్ నేరగాళ్లతో కలిసి ఈ కుంభకోణానికి తెరతీసిన బ్యాంక్ అధికారులు అక్రమంగా వారికి అకౌంట్లు ఓపెన్ చేయించి ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇక ఈ ఆపరేషన్ ఆక్టోపస్–2.0లో 16 స్పెషల్ సైబర్ పోలీస్ టీమ్స్ పాల్గొన్నాయి. మరోవైపు.. ఈ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సైబర్ బాధితుల డబ్బులను దారి మళ్లించేందుకు సైబర్ కేటుగాళ్లు ఏకంగా 350 బ్యాంక్ అకౌంట్లను ఉపయోగించినట్లు వెల్లడైంది. దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 850 సైబర్ కేసులతో ఈ బ్యాంక్ అకౌంట్లకు సంబంధం ఉన్నట్లు గుర్తించి ఆ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఈ నిందితులు అంతా కలిసి ఏకంగా రూ.150 కోట్ల మేర భారీగా సైబర్ మోసాలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# చిన్నారి పునర్వికి స్ఫూర్తితో 'ప్రాజెక్ట్ పునర్విక'

ఈ వ్యాధులకు దీర్ఘకాలిక పరిష్కారాలను అన్వేషించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు మానసిక ధైర్యాన్ని అందించేందుకు ఒక ప్రత్యేక సపోర్ట్ సిస్టమ్‌ను కూడా ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేయనున్నారు. అరుదైన వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, ప్రతి చిన్నారికి సామాజిక హోదాతో సంబంధం లేకుండా సమానంగా, సులభంగా చికిత్స అందేలా చూడటమే ప్రాజెక్ట్ పునర్విక ప్రధాన లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### - నారా లోకేష్ ఆలోచనకు కారణం ఈ ఘటన..

అరుదైన జన్యు వ్యాధి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైపు–1)తో పోరాడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాలను కాపాడేందుకు ఏపీ మంత్రి నారా లోకేష్ మానవీయతతో స్పందించారు. ఈ వ్యాధి చికిత్సకు అవసరమైన జోల్‌జెన్‌స్మా ఇంజెక్షన్ ధర రూ. 16 కోట్లు కాగా, సోషల్ మీడియా ద్వారా ప10 కోట్ల రూపాయల క్రౌడ్ ఫండింగ్ సమకూరింది. మిగిలిన బాధ్యతను మంత్రి లోకేష్ స్వయంగా తీసుకుని, ఈ ఖరీదైన మెడిసిన్‌ను అమెరికా నుండి తెప్పించడంలో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో ఏప్రిల్ 18న చిన్నారికి ఈ ఇంజెక్షన్ ఇచ్చే సమయంలో లోకేష్ స్వయంగా హాజరై పాప తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అసలు ఈ ఎస్ఎంఏ టైపు–1 వ్యాధి, దానికి వాడే ఇంజెక్షన్ ఇంత ఖరీదు ఎందుకు అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఎస్ఎంఏ అనేది 10 వేల మందిలో ఒకరికి వచ్చే అత్యంత అరుదైన జన్యు లోపం. పుట్టుకతోనే ఎస్ఎంఎన్1 అనే జీన్‌లో వచ్చే మార్పుల వల్ల వెన్నెముకలోని నరాల కణాలు దెబ్బతింటాయి. దీనివల్ల కండరాలు క్షీణించి పిల్లలు కనీసం ఊపిరి తీసుకోలేక, ఆహారం మింగలేక 2ఏళ్ల వయసులోపే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. దీనికి ఉన్న ఏకైక పరిష్కారం ఈ ఇంజెక్షన్ మాత్రమే. జోల్‌జెన్‌స్మా అనేది సాధారణ మందు కాదు. ఇది ఒక అద్భుతమైన బయోలాజికల్ ఇంజనీరింగ్ ప్రక్రియ. ఈ ఇంజెక్షన్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ లాగా పనిచేస్తుంది. శాస్త్రవేత్తలు హాని చేయని ఒక వైరస్‌ను వాడుకుని, దాని ద్వారా ఆరోగ్యకరమైన ఎస్ఎంఎన్1 జన్యువును నేరుగా వెన్నుపాములోని నరకణాల కేంద్రకంలోకి పంపిస్తారు. అక్కడ ఇది పాడైపోయిన జన్యువు స్థానాన్ని భర్తీ చేసి, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఈ ఇంజెక్షన్ ధర 16 కోట్లు ఉండటానికి కారణం దాని తయారీలో ఉండే క్లిష్టత, అది అందించే రిజల్ట్. ఇది జీవిత కాలంలో కేవలం ఒక్కసారి మాత్రమే ఇచ్చే డోస్. సాధారణ మందులు కేవలం వ్యాధి లక్షణాలను తగ్గిస్తే, ఈ జీన్ థెరపీ వ్యాధి మూలాన్నే సరిచేస్తుంది. అందుకే దీని తయారీకి అయ్యే పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్ ఖర్చుల కారణంగా దీని ధర భారీగా ఉంటుంది. చిన్నారి పునర్విక ప్రాణాల కోసం 10 కోట్లు క్రౌండ్ ఫండింగ్ ద్వారా వచ్చినా, మిగతా రూ.6 కోట్లను నారా లోకేష్ భరించి సమయానికి ఔషధాన్ని అందించడం ద్వారా ఆ కుటుంబంలో ఆశలు చిగురించేలా చేశారు.

# ఉచిత రైలు ప్రయాణంపై సర్కార్ క్లారిటీ

ప్రతిపాదనను రైల్వే శాఖకు లేఖ ద్వారా పంపించింది. ప్రయాణికులకు ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలనే అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు వెల్లడించింది. అయితే ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దక్షిణ మధ్య రైల్వే కొన్ని టెక్నికల్ అంశాలను ప్రస్తావించినట్లు పేర్కొంది. ఈ ఉచిత రైలు పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన నిబంధనలతో కూడిన ఒప్పందాన్ని (ఎంఓయూ) సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని దక్షిణ మధ్య రైల్వే కోరింది. ఇక దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలంటే ఆ ప్రతిపాదనను ఆమోదం కోసం రైల్వే బోర్డుకు పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రైళ్ల సంఖ్య రైలు వేళలు, స్టేషన్లలో కల్పించే సౌకర్యాలు అన్నీ కూడా రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం కల్పించబడతాయని పేర్కొంది. అయితే ఈ ఉచిత రైలు ప్రయాణ అంశం ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దానిపై వివరణ ఇచ్చింది. ఉచిత ఎంఎంటీఎస్ రైలు ప్రయాణానికి సంబంధించి ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి ప్రయాణికులు గందరగోళానికి గురికావద్దని హితవు పలికింది. ప్రభుత్వం అధికారికంగా వెలువరించే ప్రకటనలను మాత్రమే నమ్మాలని పేర్కొంది. రైల్వే బోర్డు ఆమోదం ఒప్పంద ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే ఉచిత రైలు ప్రయాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# కవితకు కొత్త జోష్

హైదరాబాద్ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో జాగృతి కండువా కప్పి కవిత తన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పందించిన కవిత రాష్ట్ర సాధన కోసం పని చేసిన నేతలంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న పార్టీలను వదిలేసి రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఎదగనున్న జాగృతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్ కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానన్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ జాగృతి నుంచే రాథోడ్ బాపూరావు బీఆర్ఎస్‌లో చేరి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేసిన కవిత ఇప్పుడు తిరిగి జాగృతిలోకి వచ్చినట్లు తెలిపారు. తాను పెట్టనున్న కొత్త పార్టీలో చేరేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నేతలు వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులంతా ఇప్పుడు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. కొత్త పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదరణ ఉంటుందని వెల్లడించారు. తెలంగాణకు కవిత ముఖ్యమంత్రి కావాలని రాథోడ్ బాపూరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడానికి కవిత ఇచ్చిన ధైర్యమే కారణమని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీలో తన తర్వాత వచ్చిన వారు కూడా మంత్రులు అయ్యారని కానీ తాను 2 సార్లు గెలిచినా మూడోసారి టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినా తనకు సరైన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. కొత్త పార్టీ పెట్టిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. మరోవైపు సిరిసిల్ల జిల్లా నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నేతలు జాగృతిలో చేరినట్లు కవిత తెలిపారు. మరోవైపు ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్‌ను పెట్టలేదని దీంతో ఆదివాసీలు తామ మతాన్ని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేదని లింగయ్య దొర ఆవేదన వ్యక్తం చేశారు.
ఇది ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని ఆదివాసీల కోసం జనగణనలో ప్రత్యేక కాలమ్ పెట్టాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. అదే సమయంలో భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఆదివాసీల భాష కోయతూర్‌ను చేర్చాలని కవిత డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న 12 కోట్ల మంది ఆదివాసీలు నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులు అని తమ కొత్త పార్టీలో ఆదివాసీల గౌరవాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు.

# బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆసక్తికర పరిణామం

### - సోషల్ మీడియాలో 'ఝుల్మురి' ఫోటోలు వైరల్

ఝార్గ్రామ్‌లో జరిగిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం ప్రధాని మోదీ హెలిప్యాడ్ మైదానానికి వెళ్తుండగా అకస్మాత్తుగా కాలేజ్ మోడ్ వద్ద ఆగారు. అక్కడ ఒక స్థానిక దుకాణానికి వెళ్లి బెంగాల్ ఫేమస్ స్నాక్ 'ఝాల్ ముడీ' కొనుగోలు చేశారు. బెంగాలీ స్నాక్ రుచిని ఆస్వాదించారు. ఈ సందర్భంగా వర్తకుడికి రూ.10 సైతం చెల్లించగా అతడు వద్దు అని వారించినా తీసుకో అని చెప్పి ఇచ్చారు. ఆయన ఝాల్ ముడీ తింటూ అక్కడి స్థానికులతో మోదీ కాసేపు ముచ్చటించారు. తాను బెంగాల్‌లో ఆదివారం పాల్గొన్న 4 ఎన్నికల ర్యాలీల మధ్య ఝార్గ్రామ్‌లో రుచికరమైన ఝాల్ ముడీ తిన్నానని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఆయన దుకాణదారుడికి ప్రధాని మోదీ నగదు చెల్లించడం విశేషం. ఫోటోల్లో ప్రధాని దుకాణం వద్ద నిలబడి ఝాల్ ముడీ తింటూ, చుట్టుపక్కల ఉన్న చిన్నారులతో ఆ స్నాక్స్ షేర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి పౌరులతో మాట్లాడటంతో వారు చాలా సంతోషించారు.

### - బెంగాల్ అస్తిత్వం ప్రమాదంలో ఉంది

ఝార్గ్రామ్ విజయ్ సంకల్ప సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ వారసత్వాన్ని, అస్తిత్వాన్ని కాపాడుకోవడమే ఈ ఎన్నికల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అనుసరిస్తున్న విధానాల వల్ల బెంగాల్ తన అస్తిత్వాన్ని, గుర్తింపును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. టీఎంసీ అజెండా చాలా ప్రమాదకరమని, ఆ పార్టీ కేవలం చొరబాటుదారుల కోసమే ప్రభుత్వాన్ని నడపాలని భావిస్తుందన్నారు. చొరబాటుదారుల మతం, భాష, పద్ధతులను రక్షించే ప్రభుత్వం మళ్లీ వస్తే స్థానిక ప్రజలకే ముప్పుగా మారుతుందన్నారు. అందుకే బెంగాల్ ఈసారి మార్పు కోరుకుంటోందని మోదీ పేర్కొన్నారు.

# ఆరేళ్ల కూతురిని చితకబాదిన తండ్రి.. వీడియో తీస్తుండగా పరార్



మంచిర్యాల జిల్లాలో అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. తన కూతురు మాట వినడం లేదని ఓ తండ్రి ఆ చిన్నారిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి చితకబాదాడు. మంచిర్యాల జిల్లాలోని మందమర్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆరేళ్ల వయస్సున్న కూతురు తన మాట వినడం లేదని తండ్రి సతీష్ ఆమెను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చితకబాదుతుండగా.. అక్కడే ఉన్న ఓ పశుశుల కాపరికి ఆ చిన్నారి కేకలు వినిపించారు. దీంతో ఆ కాపరి ఈ దృశ్యాన్ని వీడియో తీశాడు. పశువుల కాపరిని చూసిన తండ్రి సతీశ్ చిన్నారిని తీసుకొని బైక్‌పై పరారయ్యాడు. చిన్నారిని విచక్షణా రహితంగా కొట్టిన సతీష్ పై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారి పట్ల తండ్రి సతీశ్ అలా కర్కశంగా వ్యవహరించడానికి గల కారణమేంటనేది క్లారిటీ రావాల్సి ఉంది.

## ఆర్యవైశ్యుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

**- అమరవాది లక్ష్మీనారాయణ**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా చట్టసభల్లో ఆర్యవైశ్యులకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం ఆందోళనకరమని, దీనిపై సమాజం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
వైశ్య కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి పేద ఆర్యవైశ్య యువత, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐక్యంగా ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమవుతుందని, సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఆర్యవైశ్య మహిళలు కూడా సేవా, ఆధ్యాత్మిక రంగాల్లో చురుకుగా పాల్గొంటున్నారని, వారి పాత్ర ప్రశంసనీయం అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా విభాగం రూపొందించిన "శ్రీ వాసవి మాత పారాయణం" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, రాష్ట్ర మహాసభ కార్యదర్శి శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నాకర్ గుప్త, అన్నదాన సత్ర చైర్మన్ కొమురవెల్లి శంకరయ్య గుప్త, మండల అధ్యక్షుడు వెంకటయ్య గుప్త, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గుప్త, ప్రధాన కార్యదర్శి హరినాథ్ గుప్త, మహిళా విభాగం నాయకులు మాధవి గుప్త, లతా గుప్త తదితరులు పాల్గొన్నారు.

## మైలారం గ్రామ యువకుడు లింగ మహేష్‌కు అంతర్జాతీయ "మనం బుక్ ఆఫ్ రికార్డ్" పురస్కారం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన లింగ మహేష్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సేవలందిస్తున్న ఆయనకు "మనం బుక్ ఆఫ్ రికార్డ్" పురస్కారం దక్కింది. లింగ మహేష్ యువతను దేశభక్తి, సేవాభావం వైపు నడిపిస్తూ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఎస్‌–ఎస్సీ జీడీ, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారికి మార్గనిర్దేశం చేస్తున్నారు. ఉచితంగా పుస్తకాలు అందిస్తూ, ట్రాఫిక్ నిబంధనలపై వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అలాగే యువతలో పెరుగుతున్న బెట్టింగ్స్, డ్రగ్స్ అలవాట్లపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ కనీసం రెండు గంటలు సమాజ సేవకు కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ వేడుకలో విశ్రాంత ఐఏఎస్ అధికారి బి. లక్ష్మీకాంతం, రిటైర్డ్ జడ్జి మధుసూదన్, రిటైర్డ్ ఎస్పీ ఎస్.ఎం. రత్న తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా లింగ మహేష్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, మధ్యతరగతి విద్యార్థులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## వనదుర్గాదేవి దర్శనంతో గజ్వేల్ బిఆర్ఎస్ నాయకులు

**- చలో జగిత్యాల సభ విజయవంతం కావాలని ఆకాంక్ష**



గజ్వేల్:( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈరోజు మెదక్ జిల్లా వనదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేపు పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న "చలో జగిత్యాల" బహిరంగ సభ విజయవంతం కావాలని వారు కోరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలు, హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత 30 నెలలుగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, హామీల అమలు విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానాలపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారని పేర్కొంటూ, అది ఒక అద్భుతమైన నిర్మాణమని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్ట్‌ను రాజకీయంగా విమర్శించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. జగిత్యాల సభను వినూత్నంగా నిర్వహించి, ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బిఆర్ఎస్ నాయకులు పాల రమేష్ గౌడ్, బైరం శివకుమార్, భీమప్ప, మధుసూదన్, కొమురయ్య యాదవ్, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాండు, పంగ మోహన్ బాబు, పంజా రాజమల్లు, రామస్వామి, దశరథ, వెంకటేశం, యాదగిరి, హైమద్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భీమా శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

**- నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది**

**- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో కొత్తగూడెంలో పార్టీ పనిచేస్తుంది - మాజీ కౌన్సిలర్ బీమా శ్రీధర్**






కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బీమా శ్రీధర్ మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో కొత్తగూడెంలో పార్టీ పనిచేస్తుందని వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే శక్తి ఏ రాజకీయ పార్టీకి కానీ, ఎవరికీ కూడా లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వద్దిరాజు రవిచంద్ర అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాధవత్ శాంతి, మాదాసు పద్మ, డీకొండ సునీత, కార్పొరేటర్ లు బీమా శ్రీవల్లి, మల్హోత్రా సాగర్, మాజీ కౌన్సిలర్ లు రుక్మాంగాధర్ భండారి, అంబుల వేణు, బొమ్మిడి రమాకాంత్, బొమ్మిడి శ్రీకాంత్, ఎండి రఫీ, గోపి, కాసుల కిరణ్, పాషా,మద్దెల సుధీర్, జూలూరి రాజేష్, వేమూరి శివ, బి. శ్రీను బొందుగుల శ్రీధర్, అహ్మద్, సాగర్, కరాటే శ్రీనివాస్, సునీల్, గంగాధర్, ఉప సర్పంచ్ దుర్గేష్, రమేష్ గౌడ్, చుంచుపల్లి మండల సర్పంచ్ లు శ్రీకాంత్, బలరాం, కన్ని,సుజాత నగర్ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## జగిత్యాలలో కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి తలసాని



జగిత్యాల : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జగిత్యాల లో జరుగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ మంత్రి , బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , ఎమ్మెల్సీ రమణ ఆదివారం పరిశీలించారు.తెలంగాణ సమాచారం పట్టణంలోని స్వామి వివేకానంద స్టేడియంలో బహిరంగ సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు, జన సమీకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లో చేరనున్న నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు.

## గచ్చిబౌలిలో రెచ్చిపోయిన కానిస్టేబుల్.. స్కూటీ కొట్టేసి, ఇదేంటని అడిగితే ఓనర్‌పై దాడి!




హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కానిస్టేబుల్ రెచ్చిపోయాడు. జిమ్ ముందు పార్క్ చేసిన స్కూటీని కొట్టేయడమే కాకుండా.. ఇదేంటని ప్రశ్నించిన ఓనర్‌పై దాడికి దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ జిమ్‌లో అన్నదమ్ములు కోచింగ్ వెళు_న్నారు. జిమ్ ముందు తమ రెడ్ కలర్ యాక్టివాను పార్క్ చేసి వెళ్లారు. అయితే యాక్టివాకు సైడ్ లాక్ వేయకపోవడంతో పార్కింగ్ నుంచి దాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. జిమ్ నుంచి బయటకొచ్చిన అన్నదమ్ములు తమ స్కూటీ కనబడకపోవడంతో కంగారుపడిపోయారు. చుట్టుపక్కల వెతకగా సమీపంలోని ఓ టీ స్టాల్ దగ్గర తమ స్కూటీ కనబడింది. దీంతో అక్కడకు వెళ్లిన అన్నదమ్ములు అది తమ స్కూటీ అని.. ఇచ్చేయాలని అడిగారు. వారు మాట్లాడుతుండగానే.. సదరు వ్యక్తి, అతని స్నేహితులు దాడికి దిగారు. నేనే రా పోలీసు.. హెడ్ కానిస్టేబుల్‌ను నేను.. నేను ఏది చేసినా నడుస్తుంది.. ఏం పీకుతావ్ నువ్వు అంటూ నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ స్కూటీ ఓనర్ బ్రదర్స్‌పై దాడికి దిగారు. దీంతో ఈ ఘటనపై బాధిత అన్నదమ్ములు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కానిస్టేబుల్ ఎవరా అని పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కవల కుమార్తెల గొంతులు కోసి హత్య చేసిన వ్యక్తి..

లక్నో: ఒక వ్యక్తి తన కవల కుమార్తెల గొంతులు కోసి హత్య చేశాడు. ఆ తర్వాత పోలీసులకు ఫోన్ చేసి తన కూతుర్లను చంపినట్లు చెప్పాడు. దీంతో పోలీసులు ఆ ఇంటికి చేరుకుని పరిశీలించారు. (మీుఅ వాశ్రీఉం ుషఅఅ ఋఋబస్త్రష్త్రీవతీం' ుష్త్రతీశీష్ం) ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. బీహార్‌కు చెందిన 48 ఏళ్ల శశి రంజన్ మిశ్రా, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్ పని చేస్తున్నాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రేష్మ, కాన్పూర్‌లోని బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్నప్పుడు శశిని కలిసింది. ఈ నేపథ్యంలో 2014 లో వారిద్దరూ వివాహం చేసుకున్నారు. 11 ఏళ్ల వయస్సున్న కవల కుమార్తెలు రిద్ధి, సిద్ధితో పాటు ఆరేళ్ల కుమారుడు వారికి ఉన్నారు. కాగా, శనివారం రాత్రి భోజనం తర్వాత శశి తన ఇద్దరు కవల కుమార్తెలను నిద్రపుచ్చాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కత్తితో వారి గొంతులు కోసి హత్య చేశాడు. ఆ తర్వాత పోలీసులకు ఫోన్ చేశాడు. తన ఇద్దరు కూతుళ్లను చంపినట్లు చెప్పాడు. దీంతో పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తం మడుగులో మరణించిన ఇద్దరు బాలికల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. వారి తండ్రి అయిన శశిని అరెస్ట్ చేశారు.మరోవైపు తన భర్త శశి తీవ్ర మానసిక కుంగుబాటుతో బాధపడుతున్నాడని, అందుకే తమ ఇంట్లో పలు సీసీటీవీ కెమెరాలు అమర్చాడని భార్య రేష్మ పోలీసులకు తెలిపింది. కుమార్తెల గదుల్లోకి వెళ్లడానికి తనను అనుమతించేవాడు కాదని ఆమె ఆరోపించింది. అయితే తన భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు శశి అనుమానించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. దీంతో కుమార్తెలను తాను చూసుకుంటానని, కుమారుడితో కలిసి విడిగా నివసించాలని పలుమార్లు భార్యకు అతడు చెప్పినట్లు తెలిసిందన్నారు. అయితే కవల కుమార్తెలను అతడు ఎందుకు హత్య చేశాడు అన్నది దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## ఇటలీలో ఇద్దరు భారతీయుల హత్య.. గురుద్వార సమీపంలో కాల్పివేత

ఇటలీ, బెర్గామోలోని కోవోలో ఇద్దరు భారతీయులు హత్యకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న గురుద్వారా మాతా సాహిబ్ కౌర్ జీ వద్ద జరిగింది. ఇదో వేర్‌హౌజ్. అయితే, ఇక్కడ కూడా ప్రార్థనలు నిర్వహిస్తారు. శుక్రవారం వైశాఖి ఫెస్టివల్ సందర్భంగా అందరూ ఉన్న సమయంలోనే ఈ హత్య ఘటన జరిగింది. స్థానికులు, అక్కడి మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. రాగిందర్ సింగ్ (48), గుర్మిత్ సింగ్ (48) అనే ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి గురుద్వారా నుంచి బయటకు వస్తుండగా ఆయుధాలతో వచ్చిన దుండగుడు ఇద్దరిపై సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో రాగిందర్, గుర్మిత్ సింగ్ అక్కడికక్కడే మరణించారు. అనంతరం దుండగుడు కారులో అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే, హత్యకు పాల్పడింది కూడా ఇండియనే అని ప్రాథమికంగా తెలుస్తోంది. వీరి మధ్య ఉన్న ఏవో కలహాలు, కక్షల కారణంగా ఈ హత్య జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. అలాగే, ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్య జరిగిందని స్థానికులు అంటున్నారు. నిందితుడు కూడా ఇంతకుముందు ఈ గురుద్వారాకు వచ్చేవాడని అక్కడివారు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నిందితుడు అనేక రౌండ్ల కాల్పులు జరిపాడు. ఘటన జరిగిన ప్రదేశం నుంచి పోలీసులు పది షెల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో మరొకరికి కూడా బుల్లెట్లు తగిలినట్లు తెలుస్తోంది.

## తొర్రూర్ రంగనాథ ఆలయంలో మళ్లీ చోరీ.. మూడోసారి కూడా హుండీలు ఎత్తుకెళ్లిన దుండగులు



రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఫరిధిలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సొంత గ్రామమైన తొర్రూర్‌లో ఉన్న ప్రసిద్ధ రంగనాథ స్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ఆలయానికి చేరుకున్న గుర్తుతెలియని దుండగులు, దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భాలయం వద్ద ఉన్న రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు.. తలుపులు విరగొట్టి ఉండటం చూసి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆలయానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆలయంలోని, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ ఆలయంలో దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస చోరీలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోలీసుల నిర్లక్ష్యం వల్లే దుండగులు పదే పదే రంగనాథ ఆలయాన్ని టార్గెట్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి వీరాభిమాని 'తెలంగాణ సత్తెమ్మ' మృతి బాధాకరం

**- మాజీ ఎంపీ వినోద్ కుమార్**



బీఆర్ఎస్ పార్టీకి వీరాభిమాని అయిన పార్టీ సీనియర్ కార్యకర్త తెలంగాణ సత్తెమ్మ మృతి చెందడం బాధాకరమని, సత్తెమ్మ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో, పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్న సత్తెమ్మ.. చివరికి ఆదివారం అంతిమ శ్వాస విడిచిందని వినోద్ కుమార్ బాధాతప్త హృదయంతో విచారం వ్యక్తం చేశారు. తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన సత్తెమ్మ.. ఆ గ్రామం మధ్య మానేరు రిజర్వాయర్‌లో ముంపుకు గురి కాగా సత్తెమ్మకు రగుడు గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చి పార్టీ పరంగా అండగా నిలిచిన విషయాన్ని వినోద్ కుమార్ గుర్తు చేశారు. సత్తెమ్మ కుటుంబ సభ్యులకు వినోద్ కుమార్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న కొలుపుల రాజు సేవలు హర్షణీయం

- ముదిరాజ్ సంఘం ప్రశంసలు
- బూరుగుపల్లి పెద్దమ్మ గుడికి లైటింగ్ ఏర్పాటుకు ముదిరాజ్ సంఘం విజ్ఞప్తి
- ఏడీఈ సానుకూల స్పందన
- గ్రామస్తుల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతా
- ఏడీఈ (కరీంనగర్ జిల్లా స్టోర్స్) : కొలుపుల రాజు




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బూరుగుపల్లి గ్రామంలో ఉన్న ముదిరాజ్ సంఘానికి చెందిన పెద్దమ్మ గుడికి విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. గుడి పరిసర ప్రాంతంలో కరెంట్ పోల్స్, వైర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అదే గ్రామానికి చెందిన ఏడీఈ కొలుపుల రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు.వారి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఏడీఈ కొలుపుల రాజు, పెద్దమ్మ గుడికి అవసరమైన విద్యుత్ సౌకర్యాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గుడి అభివృద్ధికి అవసరమైన సహాయం అందిస్తానని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు కొలుపుల రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయన సేవలను ప్రశంసించారు. సొంత గ్రామానికి అవసరమైన సదుపాయాల కోసం ముందుండి పనిచేస్తున్న కొలుపుల రాజును కొనియాడారు.అనంతరం కొలుపుల రాజు మాట్లాడుతూ, "గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధి మన అందరి బాధ్యత. పెద్దమ్మ గుడికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నాను. గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు.

# మున్నూరుకాపు భవనంలో సుదర్శన నరసింహ కళ్యాణం

**పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) మున్నూరు కాపుసత్రం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం నిర్వహించారు.108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం,వెయ్యి ఎనిమిది మంది దంపతులతో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు.ఈ కళ్యాణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి,మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని,ముఖ్యంగా మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో భారీ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని 108 మంది దంపతులతో హోమం,1008 మంది దంపతులతో కళ్యాణం నిర్వహించడం విశేషమని కొనియాడారు ప్రజలందరికీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తులు భారీగా పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య విస్తరణకు నాంది

- నేహా హాస్పిటల్ తోడ్పాటుతో గ్రామంలో వైద్య సేవలు
- పరీక్షలు, మందులు ఉచితం - గ్రామస్తుల ఆనందం
- జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్
- జాగిర్యాల్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో గ్రామ పంచాయతీ,గ్రామ అభివృద్ధి కమిటీ (విడీసీ) ఆధ్వర్యంలో, నేహా హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో చిన్న పిల్లలు, పెద్దలకు రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్, ఉప సర్పంచ్ రాజేశ్వర్, విడీసీ సభ్యులు శ్రీనివాస్,గోపి, దామోదర్,వార్డు సభ్యులు గంగాధర్, రాజేందర్, సంజు, రాజేశ్వర్, సురేష్, కళ్యాణ్ పాల్గొన్నారు. అలాగే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం తనకు ముఖ్యమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామాల్లో తరచుగా నిర్వహించడం వల్ల ప్రజలు ముందుగానే తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. నేహా హాస్పిటల్ వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

# దేవాలయాల అభివృద్ధితో గ్రామాల్లో ఐక్యత పెరుగుతుంది

- చొప్పదండి ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు : డాక్టర్ మేడిపల్లి సత్యం
- కోరెం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సత్యం
- కోరెంలో ఆధ్యాత్మిక కేంద్రానికి మౌళిక వసతుల ఏర్పాటు





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండలం,కోరెం గ్రామంలోని కొండ పోచమ్మ ఆలయానికి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు,నూతన ఎలక్ట్రిసిటీ లైన్‌ను ప్రారంభించిన అనంతరం చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఒగ్గు కళాకారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, గ్రామ దేవాలయాల అభివృద్ధి ద్వారా గ్రామాల ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కోరెం గ్రామంలోని కొండ పోచమ్మ ఆలయానికి సీసీ రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించడం వల్ల భక్తులకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతులు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అలాగే, గ్రామాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకలని, ఈ తరహా అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో కూడా కోరెం గ్రామ అభివృద్ధికి మరిన్ని పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి అక్రమాలపై కరువైన రెవెన్యూ నిఘా...

- మంథనిలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా ఎర్ర మట్టి తవ్వకాలు...
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తాం...
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్...








మంథని ( ప్రశ్న న్యూస్) మట్టి మాఫియా దందా జోరుగా సాగుతుంది అనుమతులు లేకపోయినా, పరిమితికి మించి తవ్వకాలు జరుపుతూ, అక్రమంగా మట్టిని తరలిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు మంథని లో మట్టి మాఫియా అక్రమ మట్టి తరలించడంలో ప్రతి ఆదివారం ఒక రూటు మార్చుతుంది గత వారం గాడుదల గండి సమీపంలో అడవిలోని ఎర్రమట్టిని అక్రమంగా తరలించిన మాఫియా ఈ ఆదివారం బిట్టుపల్లి,రచ్చపల్లి శివారులోని ఎర్ర మట్టిని తరలించడంలో తమ కొత్త వ్యూహాన్ని అనుసరించారు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూముల నుండి సైతం ఎర్రమట్టిని అక్రమంగా తరలించడం జరిగింది గత రెండు వారాలుగా మంథనిలో అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్న విషయం పలు పత్రికల ద్వారా రెవెన్యూ అధికారులకు చేరినప్పటికిని రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉండకపోవడం వలన అక్రమ మట్టి వ్యాపారస్తులు అదును చూసుకొని ఆదివారం వేళ మట్టిని అక్రమంగా తరలించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మంథనిలోని పలు గ్రామాల్లో నూతన గృహ నిర్మాణాలకు,ప్రభుత్వ కార్యాలయాల పనులకు యదేచ్ఛగా అక్రమ మట్టిని తరలిస్తూ రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఒక్కో ట్రాక్టర్ కు వెయ్యి నుండి పన్నెండు వందల వరకు తీసుకొని లక్షల గడిస్తున్నారు. అక్రమ మట్టి దందాకు ఎలాంటి అనుమతులు లేకుండానే గుత్తేదారులు అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు.ఈ విషయం పై సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీని అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఇప్పటికైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఉందనడంలో సందేహం లేదు. మండల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ మట్టి దందా నడుస్తున్న అధికారులకు సమాచారం అందించినప్పటికీని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గానీ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది గానీ స్పందించకపోవడం చాలా బాధాకరం. ఈ అక్రమ మట్టి రవాణాను సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోని అక్రమ మట్టి రవాణా చేస్తున్న మట్టి మాఫియా పై చర్యలు తీసుకోకుంటే రెవెన్యూ అధికారుల పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న వారి పై చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను జెసిబిలను వెంటనే సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేసాడు.

# భీంగల్‌లో మాదిగ ఐక్యవేదిక సమావేశం

- ప్రజాప్రతినిధుల సన్మానం
- మాదిగల భవిష్యత్ కార్యాచరణ పై చర్చ



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్ హాల్‌లో మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మాదిగ కుల పెద్దమనుషుల ముఖ్య సమావేశం, ఇటీవల ఎన్నికైన ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి కుల సంఘ పెద్దలు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై,మాదిగ సమాజ అభివృద్ధి,హక్కుల సాధన,భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమాజ ఐక్యతతో ముందుకు సాగాలని, యువతను సంఘటితం చేసి సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత ప్రాతినిధ్యం పెంచుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దమనుషులు, సీనియర్ నాయకులు,యువజన సంఘాలు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మీడియా ముసుగులో దందా

- పోలీస్ యాక్షన్ షురూ
- బ్లాక్ మెయిల్ జర్నలిజం బహిర్గతం - ఐదుగురు పై కేసు నమోదు
- అమ్మ హాస్పిటల్ పై బెదిరింపు చర్యలు
- హాస్పిటల్ యాజమాన్యానికి రూ.5లక్షలు డిమాండ్
- మీడియా పేరుతో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- సిరిసిల్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడిన కొంతమంది వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... అనంతనగర్‌లోని 'అమ్మ హాస్పిటల్' యాజమాన్యాన్ని లక్ష్యంగా చేసుకొని విలేకరులుగా చెప్పుకునే రవి, మహేష్,సంతోష్,భాస్కర్, ప్రవీణ్ తదితరులు కలిసి హాస్పిటల్ సజావుగా నడవాలంటే డబ్బులు ఇవ్వాలని, లేదంటే హాస్పిటల్ మూసివేయించేలా చర్యలు తీసుకుంటామని బెదిరించినట్లు తెలిపారు.ఇంకా, వరుసగా ప్రతికూల కథనాలు ప్రచురిస్తూ, ఫోన్ కాల్స్ ద్వారా కూడా బెదిరింపులకు పాల్పడి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు 'అమ్మ హాస్పిటల్' నిర్వాహకుడు గుడూరి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.మీడియా పేరుతో ఇలాంటి బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన టౌన్ ఇన్స్పెక్టర్, ఇలాంటి ఘటనలకు గురైన వారు ఎవరైనా ఉంటే నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నల్లగండ్ల హుడా కాలనీ అభివృద్ధికి వినతి



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) పార్టీలకు అతీతంగా నల్లగండ్ల హుడా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో స్థానికులు మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మంచినీటి కనెక్షన్లు, విద్యుత్ సమస్యలు, హౌస్ ట్యాక్స్ ఇబ్బందులు వంటి అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే రాక్ గార్డెన్ పార్క్ అభివృద్ధి, గార్బేజ్ తొలగింపు, ఓపెన్ జిమ్, చిల్డ్రెన్స్ పార్క్, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని సూచించారు.

దీనిపై స్పందించిన గంగాధర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, నివాసితులు పాల్గొన్నారు.

# స్మృతుల్లో చిరస్థాయిగా నిలిచే మహానుభావుడు టి. వీరభద్ర రావు



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) 2025 ఏప్రిల్ 18వ రోజు మీ కుటుంబానికి మరువలేని, ఎంతో బాధను మిగిల్చిన రోజు. ఒక తండ్రి, ఒక మార్గదర్శి, ఒక విలువల ప్రతిరూపాన్ని కోల్పోయిన రోజు. టి. వీరభద్ర రావు కేవలం కుటుంబ పెద్ద మాత్రమే కాదు, అంకితభావానికి, కష్టానికి ప్రతీక. తన కుటుంబం కోసం నిరంతరం శ్రమించి, పిల్లల విద్యను జీవితంలో అత్యున్నత స్థానంలో ఉంచిన మహానుభావుడు. ఆయన చూపిన మార్గం, నేర్పిన విలువలు నలుగురు పిల్లలను తమ తమ రంగాల్లో ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దాయి. ఆయన వారసత్వం మాటల్లో చెప్పలేనిది, విలువలు, విద్యపై ప్రేమ, సేవాభావం. డా. టి. రాజారాణి, తండ్రి గణితంపై ప్రేమను వారసత్వంగా స్వీకరించి, గణిత శాస్త్రంలో విశిష్ట స్థానం సంపాదించారు.గౌరి శంకర్, అరబిందో సంస్థలో వైస్ ప్రెసిడెంట్ ఉ డిప్యూటీ హెడ్‌గా సేవలందిస్తూ ప్రతిభను చాటుతున్నారు.డా. టి. రాజరాజేశ్వరి, "శ్రీ సాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమీ" స్థాపించి, గణితంలో విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలుస్తున్నారు.టి. పద్మజ అదే అకాడమీలో డైరెక్టర్‌గా, ఇంగ్లీష్, గణితంలో మెంటర్‌గా సేవలందిస్తున్నారు.గణితాన్ని ఎంతో ప్రేమించిన తండ్రి.అదే ప్రేమను పిల్లలలో నాటిన గురువు విద్య ద్వారా సమాజానికి సేవ చేయాలనే సంకల్పాన్ని వారిలో నింపిన మార్గదర్శి, ఇలాంటి వ్యక్తులు శరీరంగా మన మధ్య లేకపోయినా, వారి ఆలోచనలు, విలువలు, వారు చూపిన మార్గం ఎప్పటికీ నిలిచిపోతాయి. ఈ క్లిష్ట సమయంలో మీ కుటుంబానికి నా గాఢ సానుభూతి. ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ వెంట ఉండాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

# నేడు గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం



**- బోయినిపల్లి సెస్ ఏ.ఈ : ప్రశాంత్**

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుపల్లి గ్రామంలో నేడు సోమవారం 11 కేవీ లైన్ పరిధిలో చెట్ల కొట్టివేత పనులు చేపట్టినందున ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది.ఈ సందర్భంగా సెస్ వినియోగదారులు సహకరించాలని బోయినిపల్లి సెస్ ఏఈ ప్రశాంత్ తెలిపారు.

# తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చడం దురుద్దేశపూరిత వ్యాఖ్య

**- బాధ్యతా యుతంగా మాట్లాడాలి - బీజేపీ కి సూచన**

**- తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి**

**- కాంగ్రెస్ పార్టీ పట్టణ నేత, రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పూర్వ కన్వీనర్: మైలారం రాము**



వేములవాడ (ప్రశ్న న్యూస్) పార్లమెంట్‌లో తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను పాకిస్థాన్‌తో పోల్చడం అనేది అత్యంత అనుచితమని కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ నాయకుడు, రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పూర్వ కన్వీనర్ మైలారం రాము మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాధన అనేది సాధారణ రాజకీయ ప్రక్రియ కాకుండా, దీర్ఘకాల ప్రజా ఉద్యమాల ఫలితమని పేర్కొన్నారు. వేలాది మంది ప్రజల త్యాగాలు, పోరాటాలతో సాధించిన రాష్ట్రాన్ని శత్రు దేశంతో పోల్చడం తెలంగాణ ప్రజల గౌరవాన్ని అవమానపరచడమేనని అన్నారు.రాజ్యాంగబద్ధమైన విధానాలను అనుసరించి, దేశ పార్లమెంట్ ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని సూచించారు.ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను పెంచే ప్రమాదం ఉన్నందున, వెంటనే వాటిని వెనక్కి తీసుకొని తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని మైలారం రాము డిమాండ్ చేశారు.

## కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో శ్రీ బీరప్ప కామరాతి ఆలయంలో కురుమ సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. పరిశీలకులు మాజీ కురుమ సంఘం అధ్యక్షులు రేగు బాలనర్సయ్య, ఎన్నికల అధికారి కల్లేపల్లి శ్రీశైలం, ఉపసర్పంచ్ చిన్నం మల్లయ్య పర్యవేక్షణలో కురుమ సంఘం సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జోగు మహేష్ ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు అందరూ కలిసిమెలిసి ఉండాలని అన్ని కార్యక్రమాలలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కుల పెద్దలు సూచించారు. కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అచ్చిన మల్లయ్యను సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు రాజకీయంగా చైతన్య వంతులై ఐక్యంగా ఉండాలన్నారు. కురుమల హక్కుల సాధనకు, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జ సిద్ధులు, ప్రధానకార్యదర్శిగా జోగు భాను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పెద్ద కురుమ గోధుమ బీరయ్య, శెలువోజి జోగు చంద్రయ్య, వార్డు సభ్యులు చిన్నం మల్లేష్, కళ్ళే వినోద్, కుల సభ్యులు అచ్చిన కృష్ణస్వామి, ఒగ్గు నవీన్, ఏడపల్లి మహేష్, జోగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా విడుదల కార్యక్రమమును విజయవంతం చేయాలి .

**- ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి - శ్రీధర్ బాబు నాయకులకు కార్యకర్తలకు ఆదేశాలిచ్చారు**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని లో మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రైతు భరోసా విడుదల కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించినారు ఈ సభ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనమల రేవంత్ రెడ్డి . ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి . వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంత్రివర్గ సహచరులు. రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొననున్నారు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రైతు భరోసా పథకం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మంథని, రామగిరి, కమాన్పూర్, ముత్తారం. పాలకుర్తి మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.అలాగే కార్యక్రమం సజావుగా జరిగేలా బాధ్యతలు కేటాయించి, ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# 7 రోజుల్లో విచారణ ఎక్కడ ?

**జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు లెక్కచేయని పెద్దపల్లి మండల ప్రజా పరిషత్ అధికారులు**

**-ప్రజావాణి ఫిర్యాదులపై విచారణలో మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం**


**- విచారణకు ఆదేశించిన నోటీసు గడువులో విచారణ చేయలేదు**

**- ఇది అధికారుల నిర్లక్ష్యం కాదా ?**

**- ఇలాంటి అధికారులపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోరు ?**

**- ఫిర్యాదు చేయాలంటే ఉన్నత అధికారియై ఉండాలా ? మరి సామాన్యుడి ఫిర్యాదు సంగతేంటి ?**



మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన స.హా.చట్టం కార్యకర్త , సోషల్ వర్కర్ బొబ్బిలి సత్యనారాయణ రాఘవపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత 4, 5 సంవత్సరాలుగా మల్టీపర్పస్ సిబ్బంది గా పనిచేస్తున్న బాలసాని పరుశరాములు, గుండేటి ప్రభాకర్ వివిధ కారణాలు చెబుతూ సెలవుల కొరకు అబద్ధపు దరఖాస్తులు చేసి తేది 9 జూన్ 2025, 16 జూన్ 2025, 26 జూన్ 2025, 24 జూలై 2025, 26 జూన్ 2025, 14 జులై 2025, 5 ఆగస్టు 2025 తేదీలలో కరీంనగర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు హాజరయ్యారని అంతే కాకుండా కోర్టు వాయిదా కి సాక్షులకు తోడుగా పై తేదీలలో వీరికి సంబంధం లేకున్నా కూడా వివిధ కారణాలతో అబద్ధపు కారణాలను చూపుతూ కరీంనగర్ కోర్టుకు వెళ్లారని రాఘవపూర్ గ్రామంలోని 3వ వార్డులో తన ఇంటి ముందు రోడ్డుపై చెత్తా చెదారం మురికి కాలువ శుభ్రం చేశామని బొబ్బిలి సత్యనారాయణ తండ్రి బొబ్బిలి రాయమల్లు వద్ద నుండి నవంబర్, 2025 లో అతని దగ్గర నుండి బాలసాని పరుశు రాములు , గుండేటి ప్రభాకర్ 300 రూపాయలు వసూలు చేయడం జరిగిందని ఒక సెలవు విషయంలోనే అబద్ధాలు చెప్పి కోర్టుకు వెళ్లారు అంటే వారు చేసే ఉద్యోగంలో కూడా నిజాయితీ, పారదర్శకత, నిబద్ధత ఎలా ఉంటుందని ? అంతే కాకుండా వీరిద్దరిపై గ్రామంలో చాలా వరకు ఆరోపణలు వస్తూనే ఉన్నాయని ప్రత్యక్షంగా గ్రామంలో ఎవరు వీరిద్దరిపై ఫిర్యాదు చేయకపోవడంతో వీరి ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోయాయి.

**ఫిర్యాదు పై ఎలాంటి చర్యలు చేపట్టని రాఘవపూర్ సర్పంచ్ తాడిశెట్టి చామంతి**



తాను తేది: 23-02-2026 రోజున వీరిద్దరిపై రాఘవాపూర్ గ్రామ సర్పంచ్ తాడిశెట్టి చామంతి కి ఫిర్యాదు చేసి నెల రోజులైనా కూడా అధికారికంగా విచారణ జరుపుటకు తనకు గాని వారిద్దరికి గాని ఎలాంటి నోటీసు పంపించకుండా ఎలాంటి విచారణ , చర్యలు చేపట్టలేదని సర్పంచ్ ఎన్నికలలో వ్యక్తిగతంగా తాను తన తండ్రి వేసిన ఓటు చేసిన ప్రచారం పూర్తిగా వ్యర్థం అయిందని గ్రామ పాలనలో , అభివృద్ధిలో సమస్యల పరిష్కారంలో సరైన నాయకుడు లేక పారదర్శకత లోపిస్తుందని మార్పు కోసం గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే పాలకవర్గ నిర్ణయాల మేరకే పని చేస్తే ఎలా ? ఎన్నికలలో గెలిపించింది ప్రజలా ? పాలకవర్గమా ? అని బొబ్బిలి సత్యనారాయణ అసహనాన్ని వ్యక్తం చేశారు.

**సామాన్యుడి ఫిర్యాదు పై నిర్లక్ష్యం ఉన్నతాధికారుల ఫిర్యాదులపై సస్పెండ్ లు పెద్దపల్లి జిల్లాలో ఉన్నత అధికారుల ఫిర్యాదుల పైనే చర్యలా ?**

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో , క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలలో పనిచేసే ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఫిర్యాదులు ఇవ్వగానే సస్పెండ్ లు జరుగుతున్నాయి. అదేవిధంగా సామాన్యుడు అయినా బొబ్బిలి సత్యనారాయణ ఫిర్యాదు తేదీ 23 మార్చి 2026 న ప్రజావాణిలో ఫిర్యాదు ఇస్తే వారం రోజుల్లోగా ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక అందించాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి సంబంధిత శాఖ పెద్దపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం మండల పంచాయతీ అధికారికి లేఖ.నెం.ఎ6/855/2026 , తేదీ 28 మార్చ్ 2026 న జారీ చేయడం జరిగింది. ఫిర్యాదుదారునికి కూడా లేఖను పంపించడం జరిగింది. అయినా కూడా 15 రోజులు పైగా అవుతున్న ఎలాంటి విచారణ జరగలేదు ఇప్పుడు నోటీసును అనుసరించి నిర్ణీత సమయంలో విచారణ చేయని ఉన్నతాధికారలను ఏమి చేయాలి మరి ? తాను అడిగే ప్రశ్నకు పెద్దపల్లి జిల్లాలో ఎవరు సమాధానం ఇస్తారని ప్రభుత్వ పథకాలకు ప్రభుత్వ కార్యక్రమాలకు డెడ్ లైన్ విధించి నిర్ణీత సమయంలోనే వాటిని పొందాలంటే గడువు విధిస్తారు గడువు దాటితే నిర్ణీత సమయంలో రాలేదు కనుక మీకు ప్రభుత్వ ఫలాలు అందవని పక్కన పెట్టేస్తారు అలాంటప్పుడు ప్రజావాణి ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో ఎందుకు విచారణ జరపరని అలా విచారణ చేయని అధికారులపై ఎందుకు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోరని ? ప్రజల చేత ప్రజల కొరకు ఏర్పడిన ప్రభుత్వంలో జిల్లా ఉన్నత శాఖ అధికారులు ఇలా వ్యవహరించడం సమంజసమేనా అని పత్రిక ద్వారా జిల్లా ప్రజలకు తెలిసేలా బొబ్బిలి సత్యనారాయణ విమర్శించారు. ఇకనైనా ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించిన జిల్లా ఉన్నతాధికారుల పైన మండల స్థాయి అధికారుల పైన గ్రామస్థాయి అధికారుల పైన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తగు క్రమశిక్షణ , చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నానని తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

**- బండారి లక్ష్మారెడ్డి**

**- ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్, ఎలక్ట్రానిక్ ) డైరీ ఆవిష్కరణ**





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చునని సూచించారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా) నూతన సంవత్సర -2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, క్లబ్ ప్రధాన సలహాదారులు కంచుకట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. ఉప్పల్ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన ప్లాట్ల విషయాన్ని కూడా అసెంబ్లీలో లేవనెత్తానున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేలా కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, తెలంగాణా హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ ఛైర్పర్సన్ డా: శ్రీవాణి చౌదరి, లీగల్ అడ్వైజర్ హైకోర్టు న్యాయవాది కోంద్రోన్ పల్లి గిరిబాబు,వివిధ పార్టీల నాయకులు తాడూరి శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకారపు అరుణ్ పటేల్, నెర్ధం భాస్కర్‌గౌడ్, కోల రవికుమార్‌గౌడ్, ఎండి. రఫిక్, కంది శ్రవణ్ కుమార్, జలీల్‌పాషా, గుడి మధుసూదన్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, పిట్టల నరేష్, తెలంగాణ సంపత్, నాగరాజు, చల్ల వీరారెడ్డి, మార్నేని ఫణీంద్ర, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు,నకినాల ప్రసాద్, మేకల దయాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, సంయుక్త కార్యదర్శి వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు ఆనంద నరసింహారెడ్డి, పంబిళ్ల కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్లు కీర్తి సంతోష్ రాజ్, పయ్యావుల సంతోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# తెలుగు టు హిందీ...

## చేతి నిండా ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.

# కొత్త ప్రతిభకు ప్రోత్సాహం



'ఇండస్ట్రీ నుంచి 'తిమ్మరాజుపల్లి టీవీ'కి మంచి స్పందన వస్తున్నది. జనాల్లో కూడా టాక్ పాజిటివ్‌గా ఉన్నది. సినిమా రిలీజైన ఒక్కరోజులోనే ఇందులో నటించిన ఐదారుగురు కొత్తవాళ్లకు ఆఫర్లు వచ్చాయి. ఇవన్నీ నిర్మాతగా నాకు ఆనందాన్నిస్తున్న అంశాలు. కథ వినగానే ఈ సినిమా జనానికి నచ్చుతుందనిపించింది. అనుకున్నట్టే నచ్చింది. కొత్తవారితో నేను చేసిన ఈ హానెస్ట్ అటెంప్ట్ మంచి విజయాన్ని అందుకున్నందుకు నిజంగా సంతృప్తిగా ఉంది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే దృక్పథంతో తన కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై సుమైనా స్టూడియోస్‌తో కలిసి కిరణ్ అబ్బవరం నిర్మించిన పీరియడ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ జంటగా నటించారు. వి.మునిరాజు దర్శకుడు. ఇటీవలే సినిమా విడుదలైన ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన థ్యాంక్స్ మీట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. అన్ని వయసులవారినీ అలరిస్తున్న సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ' అని దర్శకుడు వి.మునిరాజు అన్నారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.


# నటీమణులకు భద్రత అనేది అన్నిటికంటే ముఖ్యం



నటీమణులకు భద్రత అనేది అన్నిటికంటే ముఖ్యమని అంటున్నది బాలీవుడ్ నటి డైసీ షా. కెరీర్ ఆరంభంలో ఓ డైరెక్టర్ తనతో అనుచితంగా ప్రవర్తించడంతో ఇండస్ట్రీనే వదిలేయాలని అనుకున్నదట. అనుకోని ఆ సంఘటనతో సెట్స్‌లో ఉండటమే నరకంలా అనిపించిందని వాపోయింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని పంచుకున్నది. సల్మాన్ ఖాన్ సరసన 'జై హో' చిత్రంతో బీటౌన్‌కు పరిచయమైంది డైసీ. అయితే, అంతకుముందు కొన్ని దక్షిణాది సినిమాల్లోనూ నటించింది. అప్పుడే ఓ చిత్ర దర్శకుడు తనపట్ల అనుచితంగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. ఆ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. "షూటింగ్‌లో ఒక సన్నివేశాన్ని వివరిస్తున్న నెపంతో.. ఒక దక్షిణాది డైరెక్టర్ నన్ను అసభ్యకరమైన రీతిలో తాకాడు. దాంతో నేను చాలా అసౌకర్యంగా ఫీలయ్యాను. ఆ ఘటన అనుకోకుండా జరిగిందేమీ కాదు. ఆ వ్యక్తి కావాలనే నా గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించాడు. ఆ చేదు అనుభవంతో సినిమాలపైనే ఆసక్తి తగ్గిపోయింది. సెట్స్‌లో ఉండటమే నరకంలా అనిపించింది" అంటూ గుర్తు చేసుకుంది డైసీ. ఆ దర్శకుడి ప్రవర్తనతో తాను చాలా కుంగిపోయాననీ, నటనకే స్వస్తి చెప్పాలని అనుకున్నానని చెప్పుకొచ్చింది. ఎంతోమంది గౌరవించే సినీ రంగంలో ఇలాంటి మనుషులు ఉంటారని ఊహించలేదని వాపోయింది. "అలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడటం అంత సులభం కాదు. కానీ, ఒక చేదు అనుభవం వల్ల నా కెరీర్ ఆగిపోకూడదని నిర్ణయించుకున్నా. ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకుని తిరిగి బాలీవుడ్‌లో ప్రయత్నాలు మొదలుపెట్టా. సల్మాన్ ఖాన్ వంటి స్టార్ హీరో సినిమాలో అవకాశం వచ్చే వరకు పెద్ద పోరాటమే చేశా! ప్రస్తుతం ఎంతో జాగ్రత్తగా ప్రాజెక్టులను ఎంచుకుంటున్నా!" అంటూ గుర్తుచేసుకున్నది. ఇంకా తన వ్యక్తిత్వాన్ని గురించి చెబుతూ.. తనకు ఎవరైనా దగ్గరికి రావడం, తాకడం ఏమాత్రం ఇష్టం ఉండదని చెప్పింది. "ఎవరైనా సరే.. నన్ను తాకడం నాకు ఏమాత్రం నచ్చదు. అందుకే నేను మసాజ్ కూడా చేయించుకోను. ఒక మహిళ తాకినా ఇష్టం ఉండదు. అలాంటిది ఒక పురుషుడు అలా ప్రవర్తించడంతో నేను వెంటనే అక్కడి నుంచి వచ్చేయాలని నిర్ణయించుకున్నా. 'మళ్లీ కలుస్తాను' అని చెప్పి వచ్చేశా. కానీ, అతణ్ని మళ్లీ ఎప్పుడూ కలవనేలేదు" అంటూ వెల్లడించింది. అయితే ఆ దర్శకుడు ఎవరనేది మాత్రం డైసీ బయటపెట్టలేదు. కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య వద్ద అసిస్టెంట్‌గా కెరీర్ ప్రారంభించింది డైసీ షా. ఎన్నో సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కనిపించింది. కన్నడలో 'భద్ర' చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. 2014లో సల్మాన్ ఖాన్ సరసన 'జై హో' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు దక్కించుకుంది. తాజాగా, అంజద్ ఖాన్ దర్శకత్వంలో రూపొందిన 'రెడ్ రూమ్' అనే వెబ్ సిరీస్‌లో నటించింది. ప్రస్తుతం పలాష్ ముచ్చల్ దర్శకత్వంలో ఒక థ్రిల్లర్ సినిమాలో నటిస్తున్నది.

## కొత్త జానర్ ట్రై చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్...


# హారర్ అంటే హారరే!




టాలీవుడ్‌లో భారీ బడ్జెట్, కమర్షియల్ చిత్రాలకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పుడు కొత్త జానర్‌లోకి అడుగుపెట్టింది. తొలిసారిగా ఓ పక్కా హారర్ సినిమాను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పకుడిగా వ్యవరించడం విశేషం. '418' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రక్తం మరకలతో ఉన్న ఒక పాత తలుపుపై '418' అనే నంబర్ కనిపిస్తోంది. ఇది సినిమా కథాంశంపై ఉత్కంఠను రేకెత్తిస్తోంది. "హారర్ సినిమాల్లో నవ్వింది చాలు. ఇక భయపడాల్సిన సమయం వచ్చింది" అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జతచేశారు. ఇటీవల కాలంలో హారర్ కామెడీలు ఎక్కువైన నేపథ్యంలో, ప్రేక్షకులకు అసలైన భయాన్ని పరిచయం చేసేందుకే ఈ సినిమాను తీస్తున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వంటి స్టార్ డైరెక్టర్ ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఆయన సినిమాల్లో ఉండే డార్క్ థీమ్, ఇంటెన్స్ మూడ్ ఈ హారర్ చిత్రానికి అదనపు బలం అవుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

## ధర్మ రక్షణ కోసం


# పరశురాముడి ఆగమనం




భారతీయ చలనచిత్ర రంగంలో యానిమేటెడ్ చిత్రాల సత్తాను చాటిన 'మహావతార్ నరసింహ' అఖండ విజయం తర్వాత, 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రెండో అడుగు పడింది. హోంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం "మహావతార్ పరశురామ్" మోషన్ పోస్టర్‌ను నేడు పరశురామ జయంతి సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసింది. కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించిన 'మహావతార్ నరసింహ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు అశ్విన్ కుమార్ విష్ణుమూర్తి దశావతారాల ఆధారంగా మొత్తం ఏడు చిత్రాలను ఈ యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తుండగా, రెండో చిత్రంగా పరశురాముడి కథను ఎంచుకున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యుద్ధ భూమిలో రక్తసిక్తమైన గొడ్డలిని ధరించి, రౌద్ర రూపంలో ఉన్న పరశురాముడిని చూపిస్తూ "ధర్మం పతనమైనప్పుడు పరశురాముడు ఉద్భవిస్తాడు.. ఆయన పాలకుడు కాదు, అధర్మాన్ని అంతమొందించే శక్తి" అని పేర్కొనడం విశేషం. సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం అత్యాధునిక 3డి యానిమేషన్ సాంకేతికతతో సిద్ధమవుతోంది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రం తెలుగు, కన్నడ, హిందీ, తమిళం మరియు మలయాళ భాషల్లో 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఏకతాటిపైకి దక్షిణాది సినీ నిర్మాతలు...

## 'సిఫ్పా' పేరిట కొత్త సంఘం ఏర్పాటు



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖ నిర్మాతలు, ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చారు. సినీ నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' (సిఫ్పా) పేరుతో ఒక కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేశారు. థియేట్రికల్ నిబంధనలు, 8 వారాల ఓటీటీ విడుదల గడువు వంటి కీలక అంశాలపై పరిశ్రమలోని ఇతర వర్గాలు తమతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న సినిమా నిర్మాణ వ్యవస్థను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని, ఇలాంటి ఆకస్మిక మార్పులు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, గందరగోళానికి దారితీస్తాయని నిర్మాతలు అభిప్రాయపడ్డారు. నిర్మాత ప్రయోజనాలను దీర్ఘకాలికంగా కాపాడే లక్ష్యంతోనే 'సిఫ్పా'ను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు.

తక్షణ సమస్యల పరిష్కారం, నాలుగు పరిశ్రమల మధ్య సమన్వయం కోసం ప్రతి పరిశ్రమ నుంచి ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న నిర్మాణ ప్రక్రియలు, హక్కుల విక్రయాలు, విడుదల ప్రణాళికలను యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. ముఖ్యంగా, ఓటీటీ విడుదల గడువుకు సంబంధించి ఏ సంఘానికి గానీ, రంగానికి గానీ ఎలాంటి హామీ పత్రాలు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి నిబంధనలపై సమిష్టి చర్చల ద్వారానే తుది నిర్ణయం తీసుకోవాలని, అప్పుడే నిర్మాతలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సినిమాకు ప్రాథమిక పెట్టుబడిదారు, నష్టభయాన్ని భరించేది నిర్మాతే కాబట్టి, పరిశ్రమకు సంబంధించిన అన్ని నిర్ణయాధికార ప్రక్రియలలో నిర్మాతదే సార్వభౌమాధికారం అని ఈ సమావేశం పునరుద్ఘాటించింది. ఈ కొత్త స్టీరింగ్ కమిటీ తరచూ సమావేశమై నిర్మాత ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని ప్రకటనలో తెలిపారు.

# కరోనా కాలం నుండి నిర్విరామంగా సేవలు

- 5 ఏళ్లుగా అన్నార్థులకు అన్నదాన సేవలు
- ఐదేళ్లు పూర్తి చేసున్న నేపథ్యంలో ట్రస్ట్ సభ్యులకు ఘన సత్కారం
- నిర్విఘ్న సేవల్లో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- దాతల, ట్రస్ట్ సభ్యుల సహకారంతో మరిన్ని సామాజిక సేవలను నిర్వహిస్తాం
- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు : డాక్టర్ మధు మహేష్





**వేములవాడ(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో దాతల సహకారంతో గత ఐదు సంవత్సరాలుగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. కరోనా కాలంలో ప్రారంభమైన ఈ సేవా యజ్ఞం ఇప్పటివరకు 1825 రోజులుగా నిరవధికంగా కొనసాగుతూ పేదలు, అన్నార్థులకు భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.ఆదివారం లక్ష్మీ గణపతి, రాజన్న, భీమేశ్వర ఆలయాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ, "అన్నిదానాల్లో అన్నదానం శ్రేష్ఠం" అనే భావంతో ఈ సేవలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు,ట్రస్ట్ సభ్యులు,శ్రేయోభిలాషులు, అలాగే ప్రతిరోజూ సేవలను ప్రజలకు చేరవేస్తున్న పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్టు ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేస్తున్న సభ్యులను ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు. ఆదివారం అన్నదాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు--స్నేహాలత దంపతులు, ప్రతాప్--స్వప్న--సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్--జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ--సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ--బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు ప్రజ్ఞ--శరత్ చంద్ర, శిరీష--సాయి చంద్ర, శర్వాణి--రవిచంద్ర దంపతులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ పాల్గొన్నారు.తమ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు లేదా ఇతర ముఖ్య సందర్భాల్లో పేదలకు ఒకపూట భోజనం అందించాలనుకునే వారు ట్రస్టు సభ్యులను లేదా 9246939388 నంబరును సంప్రదించాలని మధు మహేష్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, మధు కవిత, తోట రాజు (కౌన్సిలర్), డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, వొడ్యాల వేణు, పొలాస రాజేందర్, నక్క వేణు, గజ్జెల శ్రీనివాస్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, ఏలేశ్వరపు సాయినాథ్, మఠం శివకుమార్, సిన్నన్ ముబారిక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం పోరాడిన యోధుడి దుర్భర జీవితం

- ఇప్పుడు 'కుదు, గుడ్డ, నీడ' కోసం వేడుకోలు
- ఉస్మానియా వేదికగా పోరాటం
- 30 ఏళ్ల జర్నలిజం సేవలు...
- వృద్ధాప్యంలో నిరాశ్రయ స్థితి
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి











**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు తెలంగాణ కోసం వీధుల్లో నినదించిన స్వరం... ప్రజల సమస్యలపై కలం పట్టిన చేతులు... ఇప్పుడు ఆ చేతులకే ఆహారం దొరకని పరిస్థితి. ఇది తెలంగాణ ఉద్యమంలో తన జీవితం అర్పించిన డి.ఎల్.ఎన్. చారి. (లక్ష్మి నారాయణ చారి) దుర్భర గాథ. నిజామాబాద్‌లో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన చారి, చిన్ననాటి నుంచే విలువలతో పెరిగారు. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. దేశ స్వేచ్ఛ కోసం పోరాడినా, కుటుంబానికి మాత్రం చిల్లిగవ్వ ఆస్తి కూడా దక్కలేదు. నిజాయితీకి గౌరవం దక్కింది గానీ, ఆర్థికంగా మాత్రం ఎలాంటి భరోసా లేదు. అదే వారసత్వాన్ని చారి కూడా తన జీవితంలో కొనసాగించారు.పై చదువుల కోసం హైదరాబాద్ చేరుకున్న చారి, ఉస్మానియా యూనివర్సిటీని తన పోరాట కేంద్రంగా మార్చుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో విద్యార్థి నాయకుడిగా, ఉద్యమకారుడిగా ముందుండి పోరాటం చేశారు. అనేక నిరసనలు, దీక్షలు, ర్యాలీలలో పాల్గొని తెలంగాణ సాధన కోసం తన వంతు బాధ్యత నిర్వర్తించారు.ఉద్యమం తర్వాత కూడా ఆయన ప్రయాణం ఆగలేదు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలనే తపనతో జర్నలిజం రంగాన్ని ఎంచుకున్నారు. మూడు దశాబ్దాల పాటు నిరంతరంగా పని చేస్తూ సామాన్య ప్రజల గొంతుకగా నిలిచారు. న్యాయం కోసం, సమాజ మార్పు కోసం కలం పట్టిన ఆయన, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా వెనకడుగు వేయలేదు.కానీ, ఈ రోజు ఆయన పరిస్థితి చూస్తే మనసు కలిచివేస్తుంది. 60 ఏళ్ల వయస్సులో చారి కి ఇల్లు లేకుండా, పొలం లేకుండా, ఎలాంటి ఆస్తి లేకుండా జీవిస్తున్నారు. తినడానికి సరైన ఆహారం కూడా లేని పరిస్థితి నెలకొంది. వయోభారం పెరిగి ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా, కనీసం హెల్త్ కార్డు కూడా లేక వైద్యం పొందలేని దుస్థితి.ఒకప్పుడు ప్రజల కోసం పోరాడిన ఈ యోధుడు... ఇప్పుడు తన బతుకుదెరువు కోసం పోరాడాల్సి వస్తోంది. "జీవితం మొత్తం ప్రజల కోసం కష్టపడ్డాను... ఇప్పుడు నాకు కనీస సహాయం కావాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమల్లోకి వచ్చినప్పటికీ, చారి లాంటి యోధులు ఇంకా సహాయం కోసం ఎదురు చూడటం బాధాకరం. ఆయనలాంటి నిజాయితీ గల వ్యక్తులు వ్యవస్థలో గుర్తింపు లేక ఇబ్బందులు పడటం సమాజానికి మచ్చగా మారుతోంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి చారి కి నివాసం కల్పించాలి. 'కుదు, గుడ్డ, నీడ' వంటి కనీస అవసరాలు అందించాలి. ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డు జారీ చేసి వైద్య సహాయం అందించాలి. జర్నలిజం రంగంలో చేసిన సేవలను గుర్తించి తగిన ఆర్థిక భరోసా కల్పించాలి.స్వాతంత్ర్య సమరయోధుడి వారసుడిగా, తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించిన యోధుడిగా, ప్రజల కోసం కలం పట్టిన పాత్రికేయుడిగా చారి జీవితం ఒక ప్రేరణ. కానీ అదే జీవితం ఈరోజు దుర్భరంగా మారడం మనందరికీ ఆలోచనీయ విషయం.ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు వెంటనే స్పందించి ఈ ఉద్యమ యోధుడికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆయనకు ఆశ్రయం కల్పించడం కేవలం సహాయం మాత్రమే కాదు... సమాజం తన విలువలను నిలబెట్టుకునే బాధ్యత కూడా.

# మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- అకాల వర్షాల మధ్య ధాన్యం కొనుగోలు అలసత్వం పై ఆవేదన
- బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి : గుంటి శంకర్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గంలోని బోయినిపల్లి మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ ఎమ్మెల్యే సత్యంను కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వరి కోతలు పూర్తై దాదాపు 15 రోజులు గడిచినా ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మండల రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని,ధాన్యం నష్టపోకుండా ఉండేలా యుద్ధప్రాతిపదికన వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని గుంటి శంకర్ ఎమ్మెల్యే సత్యంను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

## మొక్కజొన్న రైతులకు
# మద్దతుగా బీజేపీ పోరాటం

- కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఆర్థిక సంక్షోభం
- ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి
- భాజపా బోయినిపల్లి మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం



**బోయినిపల్లి(ప్రశ్న న్యూస్)** రాజన్6సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భాజపా బోయినిపల్లి మండలాధ్యక్షులు ఎడపల్లి పరశురాం ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విస్తృతంగా పండినా, విక్రయానికి తగిన సౌకర్యాలు లేక రైతులు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారు.ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) ప్రకారం కొనుగోళ్లు చేయాలని, రవాణా--నిల్వ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.లేకపోతే రైతుల పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, సమస్య పరిష్కారం వరకు బీజేపీ బోయినిపల్లి మండల శాఖ పోరాటం చేస్తుందని పరశురాం పేర్కొన్నారు.

# భీంగల్‌లో పిచ్చి కుక్కల స్వైర విహారం

- నలుగురికి గాయాలు, ప్రజల్లో ఆందోళన
- కుక్కల దాడుల నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల విమర్శలు
- పిచ్చి కుక్కలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**భీంగల్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా,భీంగల్ పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా వీధుల్లో తిరుగుతున్న పిచ్చి కుక్కలు దాడి చేసి నలుగురిని గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాయపడిన వారు చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించబడినట్లు సమాచారం.పట్టణంలోని పలు కాలనీల్లో కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో భీంగల్ పట్టణ ప్రజలు సంబంధిత మున్సిపల్,పశుసంవర్ధక శాఖ అధికారులను వెంటనే స్పందించి పిచ్చి కుక్కలను పట్టుకోవడం,నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.


# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 3కే రన్

- గజ్వేల్‌లో చైతన్య ర్యాలీ



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకుని ఇన్ స్పేర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 3కే రన్ విజయవంతంగా నిర్వహించారు. ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ రన్‌లో యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ అదనపు సి.ఐ ముత్యం రాజు హాజరై రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ముందస్తు అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యాన్ని పెంపొందిస్తాయని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.రన్ ముగిసిన అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న వారందరికీ ప్రశంస పత్రాలు అందించి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ శ్రీనివాస్, డాక్టర్ నరేష్ బాబు, డాక్టర్ లింగం, టీచర్ మల్లికార్జున్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు నిరంతర అవగాహన కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, వైద్యులు, పోలీస్ సిబ్బంది, మహిళలు మరియు ఫౌండేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టి వై ఆర్ లైబ్రరీ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో టి వై ఆర్ ఫౌండేషన్ మరియు టి వై ఆర్ లైబ్రరీ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో "స్కిల్స్ రిక్వైర్డ్ ఫర్ జాబ్స్ ప్లేస్మెంట్స్" అనే అంశంపై ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి విచ్చేసిన జె. రాగసుధ ( ఎం ఎస్ ఈ , బిఈడి , ఎంబీఏ ), మ్యాథమెటిక్స్ లెక్చరర్ మరియు మాజీ హెడ్ ఆఫ్ ప్లేస్మెంట్స్, అలాగే జె. శివ సాయినాథ్ పాల్గొని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఇంటర్వ్యూలు, ప్లేస్మెంట్స్ మరియు ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా జి ఎన్ ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ శ్రీ వంటేరు గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో పట్టుదల, ప్రణాళిక ఎంత ముఖ్యమో వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మాట్లాడుతూ, టి వై ఆర్ లైబ్రరీ అండ్ నాలెడ్జ్ సెంటర్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు తమ లక్ష్య సాధనలో దోహదపడుతున్నాయని తెలిపారు.

# సెక్రటేరియట్ క్యాంటీన్ ల గందరగోళం

- కోట్ల ఖర్చు భోజనశాలల కష్టాలు
- కారిడార్లలో నిర్వహణ ప్రజల అవస్థలు
- దుమ్ము, ఎండ, వర్షం మధ్య ప్రజల భోజనం
- ప్రణాళిక లోపమే కారణమా.?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర పరిపాలనకు నాభి అయిన సెక్రటేరియట్‌లోనే క్యాంటీన్ సౌకర్యాలపై ఉద్యోగుల, ప్రజల అవస్థలు బహిర్గతమవుతోంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భోజనశాల పక్కన పెట్టి, క్యాంటీన్ నిర్వహణను మీడియా పాయింట్ పక్కన కారిడార్లలో, రహదారి పక్కన కొనసాగించడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఉద్యోగులు, సందర్శకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం సెక్రటేరియట్ క్యాంటీన్ పరిస్థితి చూస్తే “ఎండకు ఎండాలి, వర్షానికి తడవాలి” అన్నట్టుగా మారింది. భోజనం కోసం వచ్చే వారు కూర్చునే సౌకర్యం లేకపోవడంతో కారిడార్లలో నిల్చునే పరిస్థితి. రహదారి పక్కనే క్యాంటీన్ ఉండటంతో వాహనాల నుంచి వచ్చే దుమ్ము, ధూళి నేరుగా ఆహారంలో కలుస్తుందని దీనిపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత లేకుండా ఇలాంటి పరిస్థితుల్లో టిఫిన్లు, భోజనం చేయాల్సి రావడం ఆరోగ్యపరంగా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన సెక్రటేరియట్ లో భోజనశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం. సక్రమంగా వినియోగించాల్సిన క్యాంటీన్లు ఎప్పుడు ప్రజలు ఉద్యోగులతో నిండిపోయి నిలబడి తినే దుస్థితి నెలకొంటున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట తాత్కాలిక ఏర్పాట్లతో క్యాంటీన్ నడపడం ప్రభుత్వ యంత్రాంగంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. క్యాంటీన్లో మార్కెట్ ధరలు ఉన్న ఆశించిన స్థాయిలో భోజనం నాణ్యత లేదని దానికి తోడు కూర్చోవడం నిత్యం కష్టంగా ఉందని కూర్చోవడానికి కూల్చేరు లేకపోవడంతో ఎలా తింటారని ప్రశ్నిస్తున్నారు. బయట మార్కెట్ వలె ధరలు ఉన్న నాణ్యమైన భోజనం అందడం లేదని కనీసం సబ్సిడీ ధర లేదు నాణ్యమైన భోజనము లేదు సాక్షాత్ సెక్రటేరియట్ లోనే ఈ పరిస్థితి నెలకొనడంపై అక్కడికి తెలంగాణ వ్యాప్తంగా వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### పాలకులు, ఉన్నత అధికారులు పట్టించుకోకుంటే పరిస్థితి మారేది ఎప్పుడు.?

ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రులు ఐఏఎస్ అధికారులు ఉన్నత అధికారులు ఉండే సెక్రటేరియట్ లో నిర్వహణ అధికారుల నిర్లక్ష్యమా.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సెక్రటేరియట్ లోపల కూడా పరిస్థితి అంత మంచిగా లేదు. చిన్న చిన్న గదుల్లో క్యాంటీన్లను నడపడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తినేవాళ్లు ఎక్కువగా ఉండగా, గదులు, టేబుల్ లు తక్కువగా ఉండటం వల్ల రద్దీ పెరిగి, అసౌకర్యం మరింత ఎక్కువ అవుతోంది. భోజనం చేయడానికి సరైన స్థలం లేకపోవడంతో కొందరు బయటకు వెళ్లి తినాల్సిన పరిస్థితి ఏర్పడుతోందిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు పట్టించుకోకపోవడం ఉద్యోగుల్లో అసంతృప్తిని పెంచుతోంది. “కోట్లతో కట్టిన భోజనశాలలు ఎందుకు డిజైన్ చేయలేకపోయారనే ప్రశ్నకు సమాధానం లభించడం లేదు. ప్రణాళిక లేకుండా చేపట్టిన చర్యలే ఈ సమస్యలకు కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెక్రటేరియట్ వంటి కీలక కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే, సాధారణ ప్రజా కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుందో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉన్నత అధికారులు స్పందించి, భోజనశాలను సక్రమంగా వినియోగంలోకి తీసుకురావాలని, పరిశుభ్రతతో కూడిన సౌకర్యాలను కల్పించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ సమస్య మరింత పెద్దదై, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడం జరుగుతుందని సెక్రటేరియట్ క్యాంటీన్ సమస్యకు పరిష్కారం ఎప్పుడు.? భోజనశాలకు ప్రాధాన్యత ఇచ్చే రోజు ఎప్పుడొస్తుంది.? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా.? అని వేచి చూడాలి.

# మంత్రి అజారుద్దీన్‌కు ‘ఆరు నెలల’ గండం

- ఆయన మంత్రి పదవి నిలిచేనా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఇవాళ ఉదయం లోక్ భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్ గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ గురించి చర్చించినట్లు సమాచారం. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చట్టసభ సభ్యుడు కాని వ్యక్తి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఆరు నెలల లోపు అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 30వ తేదీతో ఆరు నెలల గడువు ముగియనుంది. అంటే మరో పది రోజుల్లోపు ఆయన ఎమ్మెల్సీగా నియమితులు కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరు ఉన్నప్పటికీ గవర్నర్ ఆ ఫైల్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ నెల 30 లోపు గవర్నర్ ఆమోద ముద్ర వేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయితేనే అజారుద్దీన్ మంత్రిగా కొనసాగే అవకాశం ఉంటుంది. పది రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండటంతో ఈ లోపు సాంకేతిక ఇబ్బందులను తొలగించి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరినట్లు తెలుస్తోంది. గవర్నర్ సానుకూలంగా స్పందిస్తేనే అజారుద్దీన్ పదవి సురక్షితంగా ఉంటుంది, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. ఇక 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ ఓడిపోయారు. అయితే ఆ తర్వాత 2025లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటంతో పాటు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లిం మైనారిటీ ఓటర్లను



ఆకర్షించడానికి, పార్టీ పట్టును బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అయితే ఆ ఫైల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో భేటీ కావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# టీఎంసీ మహిళలకు ద్రోహం చేసింది

## - అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా శిక్ష అనుభవిస్తుంది

**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026 ఆమోదాన్ని అడ్డుకోవడం ద్వారా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు ద్రోహం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలే శిక్షిస్తారని స్పష్టం చేశారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ కాంగ్రెస్‌తో కుమ్మక్కై మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదాన్ని అడ్డుకుందని మండిపడ్డారు. పార్లమెంట్‌లోనూ, రాష్ట్ర అసెంబ్లీలలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఈ బిల్లును టీఎంసీ మహిళా సాధికారతకు వ్యతిరేకమనే కారణంతో అడ్డుకుందని దుయ్యబట్టారు. బంగాల్‌లోని బిష్ణుపుర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు.“పార్లమెంట్‌లో టీఎంసీ మహిళలకు ఏ విధంగా ద్రోహం చేసిందో మనం చూశాం. మహిళా సాధికారతకు వ్యతిరేకం కాబట్టే రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ఆమోదాన్ని అడ్డుకునేందుకు టీఎంసీ కాంగ్రెస్‌తో కలిసి కుట్ర పన్నింది. బీజేపీ గుర్తింపు అనేది మహిళా సాధికారతతోనూ, వారి భద్రత, రక్షణతోనూ ముడిపడి ఉంది. అందుకే దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు బీజేపీపై తమ ఆశీస్సులను కురిపిస్తున్నారు. ఒక అభివృద్ధి చెందిన దేశ నిర్మాణంలో మహిళల పాత్ర విస్తృతం కావాలని, రాజకీయాల్లోకి మరింత మంది నారీమణులు రావాలని మేము కోరుకుంటున్నాం. కానీ రాష్ట్రంలోని సోదరీమణులకు, కుమార్తెలకు టీఎంసీ ఏ విధంగా ద్రోహం చేసిందో బంగాల్ ప్రజలు మరోసారి చూశారు. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల ఆగ్రహాన్ని అధికార పార్టీ ఎదుర్కోవాల్సి వస్తుంది. టీఎంసీకి మహిళా సాధికారత గానీ, నారీమణులకు రిజర్వేషన్లు గానీ వద్దు” అని మోదీ పేర్కొన్నారు.

### టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది

మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం నిరాకరిస్తూ టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రతి చట్టాన్ని, ప్రతి నియమాన్ని టీఎంసీ ఉల్లంఘిస్తోందని, కానీ మహిళా సాధికారతను మాత్రం వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. అలాగే మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడంలో టీఎంసీ నిమ్నగ్నమైందని, అది రాజ్యాంగ స్ఫూర్తి గొంతునొక్కడమేనని విమర్శించారు. టీఎంసీ సర్కార్ ఏకంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును అవమానించిందని దుయ్యబట్టారు. గిరిజన వర్గాల సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికార టీఎంసీకి చెందిన గూండాలు, సిండికేట్‌లకు మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలకు ముందు (ఏప్రిల్ 29లోపు) పోలీసుల ఎదుట లొంగిపోవడానికి వారికి ఒక చివరి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. మే 4 తర్వాత ఎవరినీ వదిలిపెట్టేది లేదని అన్నారు.

### టీఎంసీ, కాంగ్రెస్ గిరిజన వ్యతిరేక పార్టీలు

“గిరిజన వ్యతిరేక పార్టీ టీఎంసీ. ప్రపంచమంతా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును గౌరవిస్తోంది. కానీ గిరిజన వ్యతిరేక వైఖరి కలిగిన టీఎంసీ ఆమెను అవమానిస్తోంది. బంగాల్‌కు రాష్ట్రపతి వచ్చినప్పుడు, టీఎంసీ ఆమెను ఏ విధంగా అవమానించిందో దేశమంతా చూసింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానాన్ని బంగాల్ సోదరీమణులు ఎప్పటికీ మర్చిపోరు. టీఎంసీ, కాంగ్రెస్ రెండూ గిరిజన వ్యతిరేక పార్టీలే. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో ద్రౌపదీ ముర్ముకు వ్యతిరేకంగా అభ్యర్థిని నిలబెట్టాయి. మరికొద్ది రోజుల్లో జరగబోయే బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు చరిత్రాత్మకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రజలు టీఎంసీని అంతం చేస్తారు. ఈ వాతావరణం, ఉత్సాహం, ప్రేమ నిర్మమ్ సర్కార్ (క్రూరమైన ప్రభుత్వం) పట్ల ప్రజలకు ఉన్న ఆగ్రహానికి ప్రతీక” అని మోదీ



తెలిపారు.బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత రేషన్‌తో పాటు మాతృ శక్తి భరోసా కార్డు ద్వారా ఏటా రూ. 36,000 ఆర్థిక సహాయం అందిస్తామని మోదీ తెలిపారు. మహిళలకు ఇళ్లు కట్టుకోవడానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ. 1.5 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. మహిళల భద్రత, అభివృద్ధే బీజేపీకి అత్యంత ప్రాధాన్య అంశాలని చెప్పారు. పొరుగు రాష్ట్రాలైన అసోం, త్రిపుర, ఒడిశా, బిహార్‌లలోని బీజేపీ ప్రభుత్వాల పాలనలో మహిళలు పొందుతున్న ప్రయోజనాలను టీఎంసీ ప్రభుత్వ అవినీతి కారణంగా బంగాల్ మహిళలు పొందడం లేదన్నారు. బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే పేదలకు అందే ఉచిత రేషన్‌ను దొంగిలించే సాహసం ఎవరూ చేయలేరని పేర్కొన్నారు. ఈ బంగాల్ ఎన్నికలు సరికొత్త చరిత్రను సృష్టించబోతున్నాయని స్పష్టం చేశారు. టీఎంసీ భయయుగం ముగియబోతోందన్నారు. బీజేపీ విశ్వాసయుగం ప్రారంభం కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

- గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. మరోవైపు, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, వికారాబాద్ సహా మరికొన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

# భారత మార్కెట్‌లో ‘స్టీల్‌బర్డ్’ జోరు

- రాక్స్ హెల్మెట్లు కోటి యూనిట్ల అమ్మకాలు పూర్తి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ హెల్మెట్ల తయారీ సంస్థ స్టీల్‌బర్డ్ హై-టెక్ ఇండియా, భారత మార్కెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకుంది. సంస్థకు చెందిన పాపులర్ రాక్స్ సిరీస్ హెల్మెట్లు ఏకంగా 1 కోటి (10 మిలియన్) యూనిట్ల అమ్మకాలను పూర్తి చేశాయి. దేశంలో సరసమైన ధరలో లభించే ఐఎస్ఐ సర్టిఫైడ్ హెల్మెట్లకు పెరుగుతున్న ఆదరణకు ఈ విజయం నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం రూ. 969 ప్రారంభ ధరతో లభించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం రాక్స్ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. దీంతో రోజువారీ ప్రయాణికులు, యువ రైడర్లకు నాణ్యమైన భద్రత అందుబాటులోకి వచ్చింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్టీల్‌బర్డ్ తన విస్తృతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా ఈ హెల్మెట్లను ప్రజలకు చేరువ చేసింది.ఈ విజయంపై స్టీల్‌బర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కపూర్ హర్షం వ్యక్తం చేశారు. “కోటి హెల్మెట్ల అమ్మకాల మార్కును దాటడం మాపై లక్షలాది మంది రైడర్లు చూపిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. సర్టిఫైడ్ హెల్మెట్లను అందరికీ అందుబాటులోకి తెచ్చి, రోడ్డు భద్రతను పెంచే జాతీయ ప్రయత్నాలకు మేము మద్దతిస్తున్నందుకు గర్వంగా ఉంది” అని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కి పైగా ఎక్స్‌క్లూజివ్ రైడర్ షాపులు నిర్వహిస్తున్న స్టీల్‌బర్డ్, వాటి సంఖ్యను 1,000కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధునాతన ఫీచర్లతో కొత్త మోడళ్లను కూడా తీసుకురావడానికి కంపెనీ ప్రణాళికలు రచిస్తోంది. ఈ మైలురాయి, దేశంలో బాధ్యతాయుతమైన రైడింగ్ పట్ల పెరుగుతున్న సానుకూల దృక్పథాన్ని సూచిస్తోంది.

# 92 మంది భారతీయ యాత్రికులకు వీసా నిరాకరించిన పాకిస్థాన్

- వీరిలో సిక్కు గురువులపై విశ్వాసం ఉన్న సెహజ్‌ధారి భక్తులు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్‌లోని పవిత్ర క్షేత్రాలను సందర్శించాలనుకున్న 92 మంది భారతీయులకు అక్కడి ప్రభుత్వం వీసాలు నిరాకరించింది. ఖల్సా సజ్నా దివస్ వేడుకల్లో భాగంగా గురుద్వారా పంజా సాహిబ్‌ను దర్శించుకునేందుకు వీరు సిద్ధమవగా, ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఖల్సా వాక్స్ న్యూస్ పోర్టల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ 92 మంది భక్తుల పేర్ల చివర “సింగ్” లేదా “కౌర్” లేనప్పటికీ, వీరంతా పది మంది సిక్కు గురువులపై ప్రగాఢ విశ్వాసం ఉన్నవారని ఖల్సా వాక్స్ కథనంలో సుదీప్ సింగ్ పేర్కొన్నారు. మొదట ఏప్రిల్ 10 నుంచి 19 వరకు వీరికి వీసాలు మంజూరు చేసిన పాకిస్థాన్, ఆ తర్వాత వాటిని రద్దు చేయడం భారతీయ కుటుంబాల మత విశ్వాసాలను దెబ్బతీసిందని ఆయన విమర్శించారు.హిందూ సమాజాన్ని గురుద్వారాల నుంచి దూరం చేసేందుకు పాకిస్థాన్ పన్నిన వ్యూహాత్మక చర్యగా ఇది కనిపిస్తోందని సుదీప్ సింగ్ ఆరోపించారు. హిందూ, సిక్కు కుటుంబాల మధ్య బంధాన్ని ఎవరూ విడదీయలేరని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు సిక్కుల పట్ల సానుభూతి నటిస్తూనే, మరోవైపు ఐఎస్ఐ ద్వారా భారత్‌లోకి డ్రగ్స్, ఆయుధాలు పంపిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. ఈ వీసాల రద్దు అంశాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ విదేశీ వ్యవహారాల సలహాదారు పరమ్‌జిత్ సింగ్ చందోక్ తెలిపినట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విధానాల ద్వారా పాకిస్థాన్ ప్రభుత్వం గురుద్వారాలలోకి వీరి ప్రవేశాన్ని కూడా నిరోధించవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయని సుదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588